మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 6-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 127 Issue: 127

06 నవంబర్ 2025 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:20 సూర్యాస్తమయం - సా. 5:39 తిథి పాడ్యమి మ. 2:55 వరకు తరువాత విదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం భరణి ఉ. 6:33 వరకు తరువాత కృతిక తె. 3:28 వరకు యోగం వ్యతిపాత ఉ. 6:59 వరకు కరణం కౌలవ మ. 2:55 వరకు తైతుల రా. 12:59 వరకు వర్జ్యం సా. 5:01 నుండి సా. 6:25 వరకు దుర్ముహూర్తం ఉ. 10:06 నుండి ఉ. 10:51 వరకు మ. 2:38 నుండి మ. 3:23 వరకు రాహుకాలం మ. 1:24 నుండి మ. 2:49 వరకు యమగండం ఉ. 6:20 నుండి ఉ. 7:45 వరకు గుళికాకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:34 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:44 నుండి తె. 5:32 వరకు అమృత ఘడియలు రా. 1:21 నుండి రా. 2:44 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



# టెన్త్ పరీక్ష ఫీజు నేనే కడతా!

## 5 జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ.. సర్కారు బడుల్లోకి 12,292 మంది విద్యార్థులకు లబ్ధి

## మొత్తంగా రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా.. తనకు వచ్చే వ్యక్తిగత వేతనం నుంచే చెల్లిస్తానని వెల్లడి

కరీంనగర్ ఎంపీ, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన నియోజకవర్గ పరిధిలో ఉన్న టెన్త్ విద్యార్థులకు గుడ్‌న్యూస్ చెప్పారు. పేద విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఉండేందుకు బండి సంజయ్ కుమార్ చర్యలు చేపట్టారు. తన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థులందరికీ టెన్త్ పరీక్ష ఫీజును తానే భరించడానికి ముందుకు వచ్చారు.

కరీంనగర్, నవంబర్ 5 (ఈవార్తలు): అధికార వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న 5 జిల్లాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి చదువుకుంటున్నారు. ఇందులో కరీంనగర్ జిల్లాలో 4,847 మంది.. సిరిసిల్ల జిల్లాలో 4,059 మంది.. హన్మకొండ జిల్లాలో 1,133 మంది.. జగిత్యాల జిల్లాలో 1,135 మంది.. సిద్దిపేట జిల్లాలో 1,118 మంది ఉన్నారు. వీరందరి పరీక్ష ఫీజు మొత్తాన్ని చెల్లించడానికి రూ. 15 లక్షలకు పైగా ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎక్కువ మంది విద్యార్థులు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల నుంచే వస్తున్నారని.. వారి తల్లిదండ్రులు కూలీ పనులు చేసి తరువాయి 2 వ పేజీలో...





# పేమెంట్ కోటా సీఎం

## ఉన్నది 3 ఫీట్లు.. 30 ఫీట్ల డైలాగులు

## రాహుల్ గాంధీకి వేల కోట్ల ముడుపులు

### బీఆర్ఎస్ అభివృద్ధిపై చర్చకు వస్తవా?.. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందెంత?

### కనీసం రోడ్ల గుంతలైనా పూడ్చిందా?.. సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

తాను ఎలాంటి తప్పు చేయలేదని, అలాంటప్పుడు రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తికి ఎందుకు భయపడతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి ఉన్నది 3 ఫీట్లే అని, కానీ 30 ఫీట్లు ఉన్నట్లుగా డైలాగులు కొడతాడని విమర్శించారు. ఆయన ఏదో పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తనను తాను అంతకంటే ఎక్కువగా ఊహించుకోవద్దని సూచించారు. తమపై పెట్టే ఉత్తి కేసులు నిలబడవని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో పోటీ చేసే అన్ని ఎన్నికలకు డబ్బులు తెలంగాణ రాష్ట్రం నుంచే వెళుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయాన్ని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కూడా అంగీకరించారని తెలిపారు. ఇంత జరుగుతుంటే అమిత్ షా ఏం చేస్తున్నారని నిలదీశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి డబ్బులు లేవని చెబుతున్నారని విమర్శించారు.

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): రైతు బంధు, పెన్షన్ పెంపుకు, తులం బంగారం ఇవ్వడానికి డబ్బులు లేవని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని, కానీ ఢిల్లీకి మాత్రం వేల కోట్ల రూపాయలు పంపిస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర, హర్యానాతో పాటు ఇప్పుడు జరుగుతున్న బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏ విధంగా పోరాడుతుందో అందరికీ తెలుసని అన్నారు. డబ్బులు ఇక్కడి నుంచే వెళుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి వేలాది కోట్ల రూపాయలను రాహుల్ గాంధీకి ముడుపుల రూపంలో రేవంత్ రెడ్డి పంపిస్తున్నారని, దానికి బీజేపీ సహకారం కూడా ఉందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధిపై, కాంగ్రెస్ అభివృద్ధికి చర్చకు సిద్ధమా..? జూబ్లీహిల్స్ ప్యాలెస్, కమాండ్ కంట్రోల్ సెంటర్, అసెంబ్లీ, గాంధీభవన్ ఎక్కడికి రమ్మన్నా వస్తామని చర్చకు సిద్ధమా ? అంటూ ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రగతి నివేదికను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్): | రూ.12,148 |
| వెండి (గ్రాము): | రూ.163 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,381 |

## విశ్వవాణి



న్యూక్లియర్ బ్లాస్ట్ జరిగే ప్రాంతంలో ఉంటే, ఎలాంటి నొప్పి కలగకముందే జీవరాశులు చనిపోతాయట. బ్లాస్ట్‌కు సంబంధించిన నొప్పిని మన మెదడు గుర్తించేలోపే, పేలుడు ధాటికే మరణిస్తారట.

# మమ్దానీ దెబ్బ.. ట్రంప్ అబ్బ!

## న్యూయార్క్ మేయర్‌గా భారతీయ మూలాలున్న వ్యక్తి

## ట్రంప్ రంగంలోకి దిగినా ఉచిత బస్సు హామీతో గెలుపు

## డైరెక్టర్ మీరానాయర్ కుమారుడే ఈ జోహ్రాన్ మమ్దానీ



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఊహించని షాక్ తగిలింది. అమెరికా స్థానిక ఎన్నికల ఫలితాలు అమెరికాలోని అధికార రిపబ్లిక్ పార్టీకి ఊహించని షాక్ ఇచ్చాయి. స్థానిక ఎన్నికల్లో అత్యంత కీలకంగా మారిన న్యూయార్క్ నగరం మేయర్ పదవిని డెమొక్రటిక్ పార్టీకి చెందిన జోహ్రాన్ మమ్దానీ సొంతం చేసుకున్నారు. నగర మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ ఎంపికయ్యారు. ఈ ఎన్నికల్లో జోహ్రాన్ మమ్దానీ మాజీ గవర్నర్ ఆండ్రు క్యూమో, రిపబ్లికన్ కర్టిస్ స్లివా ఇద్దరిని ఓడించారు. భారతీయ ఉగాండా మూలాలు ఉన్న ఆయన ఓటమి కోసం ట్రంప్ స్వయంగా - 2 వ పేజీలో...



## మామ.. మస్తుగున్నడు!

కార్తీక పౌర్ణమి వేళ.. సూపర్ మూన్ ఏర్పడింది. బుధవారం సాయంత్రం 6.49 గంటలకు కనిపించింది. అయితే మామూలుగా కంటే.. చంద్రుడు 13 శాతం అధికంగా.. 30 శాతం ప్రకాశవంతంగా కనువిందు చేసింది. పౌర్ణమి సమయంలో చంద్రుడు తన కక్ష్యలో తిరుగుతూ భూమికి అత్యంత సమీపంలోకి చేరడంతో ఈ అద్భుతం జరిగింది. ఈ సారి భూమికి చంద్రుడు మరింత దగ్గరగా వచ్చాడు. ఈ సూపర్ మూన్ ఈ ఏడాదిలో ఏర్పడిన రెండోది.



## నలుగురు తెలంగాణ వాసులు దుర్మరణం

### కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

### దైవదర్శనానికి వెళ్తొస్తూ మృతి

హల్లిఖేడ్/సంగారెడ్డి, నవంబర్ 5 (ఈవార్తలు): కర్ణాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన నలుగురు వ్యక్తులు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కర్ణాటకలోని హల్లిఖేడ్ వద్ద బుధవారం ఓ వ్యాను, కారు బలంగా ఢీకొనడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మృతులంతా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి -2 వ పేజీలో...

# బస్సు..తుస్సు



## సంగారెడ్డి జిల్లా: డివైడర్‌పైకి దూసుకెళ్లిన బస్సు

సంగారెడ్డి, నవంబర్ 5 (ఈవార్తలు): సంగారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. జాతీయ రహదారి 65 సమీపంలో పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. ముందు ఉన్న కారును తప్పించబోయి బ్రేక్ ఫెయిల్ అవడంతో బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రయాణికులు ఎవరూ కూడా గాయపడకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సు మేడ్చల్ డిపోకు చెందింది. మేడ్చల్ నుంచి ఇస్నాపూర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. బస్సులో సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.



## నాగర్‌కర్నూల్ జిల్లా: అడ్డం తిరిగిన ఆర్టీసీ బస్సు

అమ్రాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అడవి ప్రాంతంలో గల ఘాట్ రోడ్డుపై అక్కమ దేవి మలుపు వద్ద ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు అదుపుతప్పింది. బుధవారం ఉదయం హైదరాబాద్ వైపు నుండి శ్రీశైలం వెళుతున్న ఆర్టీసీ బస్సు అతి వేగంగా వెళ్లడంతో మూల మలుపు వద్ద కంట్రోల్ కాక రోడ్డుపై అడ్డం తిరిగింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.




## నిర్మల్ జిల్లా: ఆర్టీసీ బస్సు- కారు ఢీ

నిర్మల్, నవంబర్ 5 (ఈవార్తలు): నిర్మల్ జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముధోల్ మండలంలోని విటోలి–ముధోల్ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, కారు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు అష్టా గ్రామం నుంచి భైంసా వైపు వెళ్తుండగా, కారు ముధోల్ నుంచి లోకేశ్వరం మండలం వాటోలికి వెళ్తున్నట్లు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో కారులో ఉన్న వారందరూ ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. అదేవిధంగా, ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులకు కూడా ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఆదిలాబాద్ జిల్లా: బస్సు-బైక్ ఢీ.. ఒకరి మృతి

ఇంద్రవెల్లి, నవంబర్ 5 (ఈవార్తలు): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో గుంతలను తప్పించే క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంద్రవెల్లి మండలం ముత్తునూరు గ్రామ శివారులో సురేశ్(23), సంజీవ్(24) అనే ఇద్దరు యువకులు బైకుపై ఆర్‌అండ్‌బీ రహదారిపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంజీవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాశి ఫలాలు

6.11.2025

మేషం: భాగస్వామ్య వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఉంటాయి. దూరప్రయాణాల వలన తగిన విశ్రాంతి ఉండదు. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తప్పవు. ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. బంధువులతో చిన్నపాటి వివాదాలు తప్పవు.

వృషభం: నూతన వాహన సౌక్యం ఉన్నది. ఆర్థిక వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. చిన్ననాటి మిత్రులతో విందువినోదాలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి.

మిధునం: చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న పనులు పూర్తి చేయలేరు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృథా ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో మీ కష్టం ఫలించదు.

కర్కాటకం: ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ముఖ్యమైన కార్యక్రమాలు కార్యరూపం దాలుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు లాభసాటిగా సాగుతాయి. బంధుమిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్యం కలిగిస్తుంది. సన్నిహితులు, వివాదాలు సర్దుబాటు కాగలవు.

సింహం: ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. విద్యా విషయాలు సంతృప్తికరంగా ఉంటాయి. సోదరులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ధనసహాయం అందిస్తారు.

కన్య: వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఇంటా బయట బాధ్యతలతో భారంగా మారతాయి. నూతన రుణ ప్రయత్నాలు అంతగా కలిసి రావు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు ఉంటాయి.

తుల: ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. బంధువర్గం వారితో అకారణ వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన కార్యక్రమాలు ముందుకు సాగవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార, ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. కొన్ని పనులలో రెండు రకములైన ఆలోచనలతో నష్టాలు తప్పవు.

వృశ్చికం: వృత్తి వ్యాపారాలలో మీ అంచనాలు నిజమవుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి. వ్యాపారాలు, ఉద్యోగాలు ఆశాజనకంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

ధనస్సు: నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సానుకూలమౌతాయి. వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి స్నేహితుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

మకరం: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సోదరులతో ఆస్థి వివాదాలు చికాకు పరుస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. మానసిక సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు తప్పవు. ఇతరులకు మాట ఇవ్వటం మంచిది కాదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కుంభం: ఒక విషయంలో బంధువర్గం నుండి విమర్శలు తప్పవు. ఇతరుల పై మీ అభిప్రాయాన్ని మార్చుకోవడం మంచిది. కొన్ని వ్యవహారాలలో మీ అంచనాలు తప్పుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. చేపట్టిన పనులలో కష్టానికి తగ్గ ఫలితం దక్కదు. ప్రయాణాలు వాయిదా పడతాయి.

మీనం: నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగస్తులకు పదోన్నతుల పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో మీ సేవలకు గుర్తింపు పొందుతారు. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.



# ప్రధానితో విశ్వవిజేతలు

చారిత్రాత్మక విజయం సాధించిన తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు మంగళవారం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు ఆదివారం దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి ఐసీసీ ట్రోఫీని నెగ్గింది. 52 సంవత్సరాల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ చరిత్రలో తొలిసారిగా ట్రోఫీని గెలుచుకున్నందుకు హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టును ప్రధాని మోదీ అభినందించారు. వరుసగా మూడు పరాజయాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్‌ను ఎదుర్కొన్న తర్వాత టోర్నీలో అద్భుతమైన పునరాగమనం చేసి టైటిల్‌ను సాధించడంపై ప్రధాని ప్రశంసించారు. ఢిల్లీ చేరుకున్న తర్వాత మహిళా జట్టుకు హోటల్‌లో డ్రమ్స్, పూలతో ఘన స్వాగతం లభించింది. ప్లేయర్లు, కోచ్ అమోల్ మజుందార్ కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ప్రధానమంత్రి మోదీ జట్టును అభినందించారు. భారత క్రికెట్ ఈ చారిత్రాత్మక క్షణం కలల విజయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రధానికి 'నమో' అని ఉన్న జెర్సీని అందజేశారు. ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ వర్తమానంలో ఎప్పుడూ ఎలా ఉండగలుగుతున్నారు అంటూ ప్రధానమంత్రిని ప్రశ్నించారు. అలా ఉండటం తన జీవితంలో ఒక భాగమైందని, అది తనకు అలవాటుగా మారిందని ప్రధానమంత్రి తెలిపారు. 2021లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో హర్లీన్ క్యాచ్‌ను కూడా ప్రధాని గుర్తు చేశారు. ఆ సమయంలో ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఫైనల్ మ్యాచ్ తర్వాత హర్మన్‌ప్రీత్ బంతిని ఎలా జేబులో వేసుకుందో ప్రధాని చర్చించారు. బంతి తన వద్దకు రావడం తన అదృష్టమని, దాన్ని తాను కాపాడుకున్నానని చెప్పింది. అమంజోత్ కౌర్ క్యాచ్‌పై ప్రధాని చర్చించారు. ఇది తాను చూడటానికి ఇష్టపడే ఒక తడబాటని చెప్పింది. క్యాచ్ పట్టుకుంటూ మీరు బంతిని చూస్తుండాలి.. కానీ క్యాచ్ తర్వాత మీరు ట్రోఫీని చూస్తుండాలని ప్రధాని పేర్కొన్నారు. తన సోదరుడు ప్రధానమంత్రికి ఎంత పెద్ద అభిమాని అని క్రాంతి గౌడ్ చెప్పగా.. దానికి వెంటనే కలవమని చెప్పారు. ఫిట్ ఇండియా సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని క్రికెటర్లను ప్రధాని కోరారు. పెరుగుతున్న ఊబకాయం సమస్య గురించి ఆయన చర్చించారు. పాఠశాలలకు వెళ్లి అక్కడి యువతను ప్రోత్సహించాలని కోరారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మాట్లాడుతూ ప్రధానమంత్రి తమను ప్రేరేపించారని, తమకు ప్రేరణగా నిలిచారని తెలిపింది. నేడు అమ్మాయిలు అన్ని రంగాల్లో ఎలా బాగా రాణిస్తున్నారని.. దీనికి ప్రధానమంత్రి కారణమని.. ప్రధానిని కలవడానికి ఎదురుచూస్తున్నానని దీప్తిశర్మ చెప్పుకొచ్చింది.

# టెన్త్ పరీక్ష ఫీజు నేనే కడతా!

మొదటి పేజీ తరువాయి

జీవనం సాగిస్తున్నారని తెలుసుకున్న బండి సంజయ్ కుమార్.. వారి పిల్లలకు పరీక్ష ఫీజు చెల్లించడం కూడా భారంగా మారుతోందని గుర్తించారు. దీంతో ఆ మొత్తాన్ని తానే చెల్లించాలని బృహత్తర నిర్ణయం తీసుకున్నారు. తనకు వచ్చే వ్యక్తిగత వేతనం నుంచే వీరికి పరీక్ష ఫీజులు చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు నిధులు విడుదల చేసేందుకు వీలుగా ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆయన లేఖలు కూడా రాసి పంపించారు. పరీక్ష ఫీజు చెల్లించలేక ఏ ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా చూసేందుకు కేంద్రమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి బండి సంజయ్ కుమార్ నిరుపేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో.. సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే దాదాపు 20 వేల మంది విద్యార్థులకు మోదీ గిఫ్ట్ పేరుతో సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభంలో.. మోదీ కిట్స్ పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్‌బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్నులు, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్ వంటివి ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

# పేమెంట్ కోటా సీఎం

మొదటి పేజీ తరువాయి

ఓటమి భయంతో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధిపై చర్చకు రేవంత్ సిద్ధమా? అంటూ ఆయన సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో ఫ్లై ఓవర్లు, అండర్‌పాసులు నిర్మించామన్నారు. రేవంత్ ప్రభుత్వం కొత్తగా ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టిందని.. రేవంత్ ప్రభుత్వం కనీసం రోడ్లపై పడిన గుంతలనైనా పూడ్చిందా? అంటూ ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేదెవరో ప్రజలందరికీ తెలుసునని, కాంగ్రెస్ హయాంలో మంచినీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో 3వేల నుంచి 7.5 వేల మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరిగిందని.. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను మురికికూపంగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో పవర్ హాలీడేలు విధించేవారని, కేసీఆర్ పాలనలో24గంటలు నాణ్యమైన కరెంట్ అందించామన్నారు.

## డ్రగ్స్ అడ్డాగా హైదరాబాద్

కేసీఆర్ హయాంలో విద్యుత్ వెలుగులు నిండాయని, గ్రీన్ సిటీ ఆఫ్ ది వరల్డ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. 16వేల నర్సరీలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌సీయూలో జీవవైవిధ్యాన్ని నాశనం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదన్నారు. రేవంత్ బెదిరింపులకు ఎన్నో పరిశ్రమలు తరలిపోతున్నాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వాన్నంగా మారాయని విమర్శించారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి ఇక్కడ డ్రగ్స్ దందాను పట్టుకున్నారని, రూ.12వేల డ్రగ్స్ దొరికితే పట్టింపులేదా?.. తెలంగాణ ముఖ్యమంత్రి, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి రిపోర్ట్‌ను ఇంటింటికీ పంపిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5,328 కోట్లు ఖర్చు చేశామని.. మెట్రోపై రూ.1,722 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

## కేసీఆర్ పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట

ఎస్ఆర్‌డీపీ కింద రూ.333కోట్లతో షేక్‌పేట ఫ్లై ఓవర్‌ను నిర్మించామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామన్నారు. ఎర్రగడ్డలో రూ.900 కోట్లతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించామన్నారు. వెయ్యి పడకలతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించింది వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. కోవిడ్‌లో రూ.14కోట్లతో వ్యాక్సిన్లు వేశామని, బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి పేదలకు వైద్యాన్ని చేరువ చేశామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూంలు కట్టామని, రెహ్మత్‌నగర్‌లో కట్టిన 3600 డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేశామన్నారు. ప్రైవేట్ వాళ్లు కడితే ఒక్కో డబుల్ బెడ్‌రూంకు రూ.కోటి ఛార్జ్ చేసేవారన్నారు. ఆసరా పెన్షన్, కల్యాణలక్ష్మి కింద దాదాపు రూ.600 కోట్లు అందించామన్నారు. 106 మందికి దళితబంధు అందించామన్నారు.

## మా హయాంలో 204 గురుకులాలు

పండుగల కోసం 14కోట్లు అందించామని, అన్నపూర్ణ భోజనాల కోసం రూ.2కోట్లు చెల్లించినట్లు వివరించారు. మైనారిటీల కోసం 204 గురుకులాలను ఏర్పాటు చేశామని, రూ.51కోట్లతో గురుకులాలన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోరబండలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.87కోట్లు ఖర్చు చేశామని, రూ.17కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించినట్లు తెలిపారు. రూ.455 కోట్లతో పది సబ్‌స్టేషన్లను కట్టామని, జూబ్లీహిల్స్‌లో విద్యుత్ నిర్వహణ కోసం రూ.505కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.30కోట్లు ఖర్చు చేశామన్న కేటీఆర్.. రూ.180కోట్లు మంచినీటి కోసం ఖర్చు చేసినట్లు చెప్పుకొచ్చారు. పార్కుల నిర్వహణకు రూ.20కోట్లు, డీఆర్ఎఫ్ పెట్టి ప్రజలకు సహాయక చర్యలు అందించామన్నారు.

## రెండేళ్లలో చేసిన ఖర్చెంత?

బీఆర్ఎస్ హయాంలో రూ.5328 కోట్లు ఖర్చు చేస్తే.. రెండేళ్ల రేవంత్ పాలనలో ఎంత ఖర్చు చేశారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధిని చూపించి రేవంత్ ఓట్లు అడగాలని, గోపీనాథ్ వేసిన శిలాఫలకం జూబ్లీ హిల్స్‌లో ఎక్కడికి పోయినా కనిపిస్తుందన్నారు. జూబ్లీహిల్స్‌లోని ప్రతీ ఇంటికీ ప్రగతి ప్రస్థాన నివేదికను పంపిస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు వచ్చాయని.. రేవంత్ పాలనలో ఎన్ని వచ్చాయని ప్రశ్నించారు. ప్రజలే న్యాయనిర్ణేతలని.. జూబ్లీహిల్స్‌లో సరైన జవాబిస్తారన్నారు. రేషన్‌కార్డుల పంపిణీని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కువ ప్రచారం చేయలేదని, కాంగ్రెస్ అభివృద్ధి చేయలేక రేషన్‌కార్డులు ఇచ్చామని ప్రచారం చేశారన్నారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధిపై, కాంగ్రెస్ అభివృద్ధికి చర్చకు సిద్ధమా? టైమ్, ప్లేస్ చెబితే ఎక్కడికైనా వస్తామన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్, కమాండ్ కంట్రోల్ సెంటర్, అసెంబ్లీ, గాంధీభవన్ ఎక్కడికి రమ్మన్నా వస్తామని.. చర్చకు సిద్ధమా ? అంటూ కేటీఆర్ సవాల్ విసిరారు.

# మమ్దానీ దెబ్బ.. ట్రంప్ అబ్బ!

మొదటి పేజీ తరువాయి



రంగంలోకి దిగారు అంటే ఈ స్థానిక ఎన్నిక డోనాల్డ్ ట్రంప్ కు ఎంత ప్రతిష్టాత్మకంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికలకు ముందు అతడిని గెలిపించ వద్దని ట్రంప్ పోస్ట్ చేశారు. ఒకవేళ జోహ్రాన్ మమ్దానీ గెలిస్తే కనీస అవసరాలకు సరిపడిన స్థాయిలోనే నిధులు కేటాయిస్తానని, న్యూయార్క్ నగరానికి భారీగా నిధుల కేటాయింపు జరగదు అని అర్థం వచ్చేలా ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయినప్పటికీ న్యూయార్క్ ప్రజలు అతనికి పట్టం కట్టి ట్రంప్ కు షాక్ ఇచ్చారు. అతిపిన్న వయసులోనే న్యూయార్క్ మేయర్ గా ఎంపికైన వ్యక్తిగా జోహ్రాన్ మమ్దానీ రికార్డు సృష్టించారు. న్యూయార్క్ మేయర్ గా గెలిచిన జోహ్రాన్ మమ్దానీ భారతీయ సినీ డైరెక్టర్ మీరానాయర్ కుమారుడు. ఉగాండా జాతీయుడైన మహమ్మద్ మమ్దానీ, మీరాల సంతానమే జోహ్రాన్ మమ్దానీ. సోషలిస్ట్ భావజాలం ఉన్న అతడు, ప్రస్తుతం భారత్ అంటేనే ఈర్ష్యా ద్వేషాలతో రగిలిపోతున్న ట్రంప్ ని ఢీకొట్టి నిలిచిన భారతీయ సంతతికి చెందిన ముస్లిం మేయర్. ప్రస్తుతం ఇది అమెరికాలో మాత్రమే కాదు ఇండియాలో కూడా ఆసక్తికర చర్చకు కారణంగా మారింది. న్యూయార్క్ మేయర్‌గా గెలిచిన ఆయన ప్రజా సంక్షేమం కోసం అందిస్తామని చెప్పిన హామీలే గెలిపించాయి. ముఖ్యంగా అత్యంత కీలకమైన ఉచిత సిటీ బస్సు ప్రయాణాల హామీని, నగరంలో అద్దెలను స్థిరీకరిస్తానని, యూనివర్సల్ చైల్డ్ స్కీమ్ అమలు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. 2030 నాటికి కనీస వేతనాలను పెంపు చేస్తామని చిరు వ్యాపారుల జీవన వ్యయాలను తగ్గించి, కార్పొరేట్ల పైన, సంపన్నుల పైన పన్నులు పెంచుతామని పేర్కొన్నారు. ఈ హామీలు నగర ప్రజలను ఆకట్టుకోగా, అన్నింటికంటే ట్రంప్‌ని ఎదిరించే ధైర్యం జనాలకు నచ్చి న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీకి పట్టం కట్టారు.



# నలుగురు తెలంగాణ వాసులు దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ (40), రాచప్ప (45), కాశీనాథ్ (60), నాగరాజు (40) మరికొందరితో కలిసి కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గాణగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి వెళ్లారు. దైవ దర్శనం ముగించుకుని కారులో తిరిగి స్వగ్రామానికి పయనమయ్యారు. ఈ క్రమంలో హల్లిఖేడ్ వద్ద వీరు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న వ్యాను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రతకు నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, కారులోని మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు యాత్రకు వెళ్లి మృత్యువాత పడటంతో జగన్నాథ్‌పూర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# కాశీ తీరాన.. దీపాల అలలు

కార్తిక పౌర్ణమి సందర్భంగా పవిత్ర వారణాసి క్షేత్రంలో 'దేవ్ దీపావళి' వేడుకలను ఘనంగా నిర్వహించారు. గంగా నది తీరంలోని ఘాట్‌లను లక్షలాది దీపాలతో అలంకరించారు. ఈ వేడుకలు భక్తులకు, పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించాయి. ఈ కార్యక్రమం కోసం దాదాపు 10 లక్షల మట్టి ప్రమిదలు సిద్ధం చేశారు. కాశీలోని 20 ప్రాంతాల్లో దీపాలను వెలిగించారు. దీంతో ఆ ప్రాంతమంతా బంగారు వర్ణంతో మెరిసిపోయింది.

# రేపు వందేమాతరం ఆలపించాలి

**దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పిలుపు**

న్యూఢిల్లీ: వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో నవంబర్ 7న ఉదయం 10 దేశ ప్రజలంతా ఒక నిర్ణీత సమయంలో వందేమాతర గేయం ఆలపించాలని కోరింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. గవర్నర్లు, సీఎం నేతృత్వంలో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్థులు ఇందులో పాల్గొనేలా చూడాలని తెలిపింది. కేంద్రం ఆదేశాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణ వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటోంది. దీని కోసం రాష్ట్ర నోడల్ అధికారిగా భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్ మల్లికార్జున రావును తెలంగాణ ప్రభుత్వం నియమించింది. విద్యాలయాల్లో, జిల్లాల్లో, మండల స్థాయి వరకు అన్ని చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచనలు జారీ చేసింది. సామూహిక గేయ ఆలాపన కోసం అన్ని రాష్ట్రాల నోడల్ అధికారులతో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నిర్దిష్ట కార్యాచరణను రూపొందించనుంది.




# 'హైడ్రా'కు మద్దతుగా ర్యాలీలు

**ప్రభుత్వ భూములను కాపాడుతున్నందుకు ప్రజల మద్దతు**

**కొండాపూర్, మణికొండ ప్రాంతాల్లో స్థానికుల కృతజ్ఞతా ర్యాలీలు**

కొండాపూర్/మణికొండ, నవంబర్ 5 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ భూములను కబ్జాదారుల చెర నుంచి విడిపించేందుకు ఏర్పాటైన 'హైడ్రా' సంస్థకు ప్రజల నుంచి అపూర్వ మద్దతు లభిస్తోంది. వందల కోట్ల రూపాయల విలువైన పార్కులు, ప్రజా అవసరాల స్థలాలను కాపాడినందుకు కృతజ్ఞతగా కొండాపూర్, మణికొండ వాసులు ర్యాలీలు నిర్వహించి తమ అభినందనలు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ఇటీవల కొండాపూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో సుమారు రూ.30 కోట్ల విలువైన 2,000 గజాల పార్కు స్థలాన్ని 'హైడ్రా' అధికారులు కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సమీపంలోనే ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల కాలనీలో పాఠశాల వంటి ప్రజా అవసరాల కోసం కేటాయించిన 4,300 గజాల స్థలాన్ని కూడా కాపాడారు. దీని విలువ రూ.86 కోట్లు ఉంటుందని అంచనా. దీంతో ఆనందం వ్యక్తం చేసిన స్థానిక మహిళలు, పిల్లలు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి 'హైడ్రా'కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 15 కాలనీల ప్రజలు 'మర్రి చెట్టు' ప్రాంతంలో భారీ ర్యాలీ చేపట్టారు. "మణికొండ థాంక్స్ హైడ్రా" వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. తమ ప్రాంతంలో రూ.1,000 కోట్లకు పైగా విలువైన పార్కులు, ఖాళీ స్థలాలను 'హైడ్రా' కాపాడిందని, నగరాన్ని పచ్చగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తోందని వారు ప్రశంసించారు.

# ముగ్గురు మావోయిస్టుల మృతి

**ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్**

**మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న బలగాలు**

**జనవరి నుంచి ఇప్పటివరకు 477 మంది మావోయిస్టుల హతం**



బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దుకు సమీపంలోని తార్లగూడ ప్రాంతంలో ఈ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే... అన్నారం, మరిమల్ల గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై నిఘా వర్గాల నుంచి పక్కా సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అయితే, దీనిపై అధికారికంగా పూర్తి ప్రకటన వెలువడాల్సి ఉంది. బుధవారం సాయంత్రం నాటికి కూడా ఆపరేషన్ కొనసాగుతూనే ఉందని అధికారులు వెల్లడించారు. "బీజాపూర్ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది, పరిస్థితి సాధారణంగానే ఉంది. ఆపరేషన్‌కు సంబంధించిన కీలక వివరాలను తగిన సమయంలో అందిస్తాం" అని మధ్యాహ్నం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనపై స్పందిస్తూ, హతమైన మావోయిస్టులు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పనిచేస్తున్న స్థానిక కమిటీలకు చెందినవారై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. 2026 మార్చి నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్లను తీవ్రతరం చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2024 జనవరిలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1,785 మందిని అరెస్ట్ చేశారు. వివిధ ఆపరేషన్లలో 477 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఒకవైపు సైనిక చర్యలు కొనసాగిస్తూనే, మరోవైపు 'ఆత్మసమర్పణ్ ఏవం పునర్వాస్ నీతి 2025', 'నియాద్ నెల్లా నార్ యోజన' వంటి పథకాల ద్వారా లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తూ ప్రభుత్వం ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తోంది.

# ఆరు గ్యారెంటీల సంగతేంది?

**ముందు గ్యారంటీల అమలుపై చర్చకు రా.. సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్**

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు అరెస్టుల సంగతి పక్కనపెట్టి, ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. తమపై అనవసర ఆరోపణలు చేయడం మానుకుని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డిక్లరేషన్లు, 420 హామీలపై చర్చకు సిద్ధమా? కాళేశ్వరం కేసుపై విచారణ జరిపిస్తామని మేం ఎన్నికల్లో హామీ ఇవ్వలేదు. ముందు మీరు ఇచ్చిన హామీల గురించి మాట్లాడండి. ఆ తర్వాత మిగతా విషయాలు చర్చిద్దాం" అని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని, అందుకే కాళేశ్వరం కేసులో కేసీఆర్, హరీశ్‌రావులను సీబీఐ అరెస్ట్ చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నెల 11వ తేదీలోగా వారిద్దరినీ సీబీఐతో అరెస్ట్ చేయించి బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఈ ఆరోపణల నేపథ్యంలోనే కిషన్‌రెడ్డి పైవిధంగా స్పందించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో తెలంగాణ రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# అజారుద్దీన్‌కు మంత్రి పదవిస్తే కిషన్‌రెడ్డికేం బాధ?

**మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు ఉండకూడదో చెప్పాలి**

**తాను మొదట సెక్యులర్ భావాలు కలిగిన వ్యక్తినన్న రేవంత్ రెడ్డి**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి వచ్చిన ఇబ్బందేమిటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని విమర్శించారు. నియోజకవర్గంలో రూ. 400 కోట్లతో అభివృద్ధి పనులను చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్ నగరంలో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కిషన్ రెడ్డి చెప్పాలని నిలదీశారు. కిషన్ రెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తాను మొదట సెక్యులర్ భావాలు కలిగిన వ్యక్తినని అన్నారు. కొడంగల్‌లో తాను మూడుసార్లు గెలవడంలో మైనారిటీల సహకారం ఉందని వెల్లడించారు. ఇరవై నెలల కాంగ్రెస్ పాలనలో మైనారిటీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇద్దరూ ఒకటే అన్నారు. ముస్లింలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని అన్నారు. సవాల్ విసిరి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటేనని అన్నారు.


# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యం

**ఈ విషయాన్ని కవితే చెప్పారు: రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): బీజేపీలో బీఆర్ఎస్ విలీనమయ్యే అవకాశం ఉందని, ఈ విషయాన్ని గతంలో కల్వకుంట్ల కవిత చెప్పారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టారని ఆయన విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్ జోడో యాత్ర ద్వారా దేశంలోని మైనారిటీలకు రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారని అన్నారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి 3 నెలలైనా స్పందించలేదని విమర్శించారు. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ ఇంకా అనుమతి ఇవ్వలేదని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు.

# హుస్సేన్ సాగర్‌లో తల్లీకూతుళ్ల మృతి

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): హైదరాబాద్ లోని బహదూర్ పురాకు చెందిన ఓ మహిళ తన రెండేళ్ల కుమార్తెతో కలిసి హుస్సేన్ సాగర్ లో దూకి ఆత్మహత్య చేసుకుంది. నెక్లెస్ రోడ్ లోని నీరా కేఫ్ సమీపంలో నీటిలో తేలుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని వెలికితీసి మార్చురికి తరలించారు. మహిళ వివరాల కోసం లేక్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మిస్సింగ్ కేసు ఆధారంగా ఆత్మహత్యకు పాల్పడింది కీర్తిక అగర్వాల్ గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చార్టెడ్ అకౌంటెంట్ అయిన కీర్తికకు పాతబస్తీకి చెందిన వ్యాపారవేత్త పృథ్వీలాల్ తో వివాహం జరిగింది.



# హర్మన్‌ప్రీత్ పచ్చబొట్టుగా వరల్డ్ కప్ ట్రోఫీ

న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తన చారిత్రక ప్రపంచకప్ విజయాన్ని వినూత్నంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఇటీవలే గెలిచిన 2025 వన్డే ప్రపంచకప్ ట్రోఫీని తన చేతిపై పచ్చబొట్టుగా వేయించుకుని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఇది భారత మహిళల జట్టుకు తొలి వన్డే ప్రపంచకప్ కావడం గమనార్హం. ఈ టాటూలో కేవలం ట్రోఫీ మాత్రమే కాకుండా, గెలిచిన సంవత్సరం '2025', విజయం సాధించిన పరుగుల తేడా '52'ను కూడా చేర్చారు. తన కొత్త టాటూ చిత్రాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ, 'ఇది నా చర్మంపై, నా హృదయంలో శాశ్వతంగా నిలిచిపోతుంది. తొలిరోజు నుంచి నీకోసం ఎదురుచూశాను. ఇకపై ప్రతి ఉదయం నిన్ను చూస్తూ కృతజ్ఞతతో ఉంటాను' అని భావోద్వేగపూరిత క్యాప్షన్ రాశారు. ఈ విజయంతో, ఐసీసీ టోర్నమెంట్‌లో జట్టును విజయపథంలో నడిపిన తొలి భారత మహిళా కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించారు. ఈ విజయం అనంతరం బీసీసీఐ పంచుకున్న ఒక వీడియోలో ఆమె మాట్లాడుతూ, "ఈ బ్లూ జెర్సీ ఎప్పుడు వేసుకుంటానా అని కలలు కనేదాన్ని. మహిళల క్రికెట్ గురించి తెలియని ఒక చిన్నారిగా, మన దేశంలో మార్పు తీసుకురావాలని ఆశించాను. కలలు కనడం ఎప్పుడూ ఆపకూడదని ఇది నిరూపిస్తుంది. మీ విధి మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళుతుందో ఎవరికీ తెలియదు. ఇది జరుగుతుందని నమ్మితే చాలు, అదే జరిగింది" అంటూ తన ఆత్మవిశ్వాసాన్ని, స్ఫూర్తిని పంచుకున్నారు.

# పంత్ వచ్చేశాడు!

**దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ .. భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ**

**గాయం నుంచి కోలుకుని జట్టులోకి పంత్.. వైస్ కెప్టెన్సీ బాధ్యతలు**

**నవంబర్ 14 నుంచి తొలి టెస్ట్... నవంబర్ 22 నుంచి రెండో టెస్ట్**



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి రాగా, అతడికి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు కూడా అప్పగించారు. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్ట్ నవంబర్ 14 నుంచి కోల్‌కతాలో, రెండో టెస్ట్ నవంబర్ 22 నుంచి గౌహతిలో జరగనుంది. గౌహతికి టెస్ట్ వేదికగా ఇది తొలిసారి కావడం విశేషం. ఇంగ్లండ్‌తో జూలైలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో పాదం ఫ్రాక్చర్ కావడంతో పంత్ జట్టుకు దూరమయ్యాడు. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌కు కూడా అతను అందుబాటులో లేడు. అయితే, ఇటీవల సౌతాఫ్రికా-ఎ జట్టుతో జరిగిన నాలుగు రోజుల మ్యాచ్‌లో ఇండియా-ఎ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, పంత్ తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు. ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో 90 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో సెలక్టర్లు అతడిని తిరిగి జట్టులోకి ఎంపిక చేశారు. పంత్ రాకతో ఎన్. జగదీశన్‌కు జట్టులో స్థానం దక్కలేదు. పంత్‌తో పాటు యువ ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్ కూడా టెస్ట్ జట్టులోకి తిరిగి వచ్చాడు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత వెన్నునొప్పి కారణంగా రిహాబిలిటేషన్‌కు వెళ్లిన అతను, ఇటీవల ఇరానీ కప్, రంజీ ట్రోఫీ మ్యాచ్‌లలో పాల్గొని ఫామ్ అందుకున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో ఆకాశ్ దీప్‌కు అవకాశం కల్పించారు. ప్రస్తుతం ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ 61.90 శాతం పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా 50 శాతం పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఈ టెస్ట్ సిరీస్ అనంతరం ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు కూడా జరగనున్నాయి.

**ఇండియా-ఎ జట్టు కెప్టెన్‌గా తిలక్ వర్మ**

ఇదే సమయంలో, సౌతాఫ్రికా-ఎ జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనున్న ఇండియా-ఎ జట్టును కూడా బీసీసీఐ ప్రకటించింది. ఈ జట్టుకు తెలుగు ఆటగాడు తిలక్ వర్మ కెప్టెన్‌గా, రుతురాజ్ గైక్వాడ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. నవంబర్ 13, 16, 19 తేదీల్లో రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.

**భారత టెస్ట్ జట్టు:** **శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ఆకాశ్ దీప్.**

**ఇండియా-ఎ జట్టు:** **తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, విప్రాజ్ నిగమ్, మానవ్ సుతార్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్).**

# అమ్మకానికి ఆర్సీబీ

**అధికారికంగా ప్రకటించిన ఆర్సీబీ యజమాని యునైటెడ్ స్పిరిట్స్**

**2026 మార్చి నాటికి అమ్మకం పూర్తి చేయాలని లక్ష్యం**




బెంగళూరు: ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ కలిగిన జట్లలో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అమ్మకానికి రానుంది. ఈ ఫ్రాంచైజీ యజమాని, ప్రముఖ ఆల్కహాల్ బేవరేజ్ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్ఎల్) ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. తమ ప్రధాన వ్యాపారంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించే వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది. ఆర్సీబీ జట్టును నిర్వహిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్‌సీఎస్‌పీఎల్), యూఎస్ఎల్‌కు పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా ఉంది. ఈ పెట్టుబడిపై వ్యూహాత్మక సమీక్ష చేపడుతున్నట్లు యూఎస్ఎల్ తెలిపింది. దీని ప్రకారం, 2026 మార్చి 31 నాటికి ఈ అమ్మకం ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ నిర్ణయం పురుషుల ఐపీఎల్ జట్టుతో పాటు, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) జట్టుకు కూడా వర్తిస్తుంది. ఈ పరిణామంపై యునైటెడ్ స్పిరిట్స్ ఎండీ, సీఈఓ ప్రవీణ్ సోమేశ్వర్ మాట్లాడుతూ, "యూఎస్ఎల్‌కు ఆర్‌సీఎస్‌పీఎల్ ఒక విలువైన ఆస్తి. అయితే, మా ప్రధాన వ్యాపారమైన ఆల్కహాల్ బేవరేజెస్ పరిశ్రమకు ఇది సంబంధం లేనిది. వాటాదారులందరికీ దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించేందుకు మా పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకుంటున్నాం. ఇందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆర్‌సీబీ ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకుంటాం" అని వివరించారు. యూఎస్ఎల్ మాతృసంస్థ డయాజియో ఈ అమ్మకం ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలుస్తోంది. అమ్మకం ప్రక్రియకు ఒక నిర్దిష్ట గడువును ప్రకటించడం చూస్తుంటే, ఇప్పటికే కొనుగోలుదారులతో చర్చలు తుది దశకు చేరుకొని ఉండవచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఆర్సీబీని కొనుగోలు చేసేందుకు పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. వీరిలో అదానీ గ్రూప్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు చెందిన జిందాల్స్, సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత అదార్ పూనావాలా, దేవయాని ఇంటర్నేషనల్ గ్రూప్ ఛైర్మన్ రవి జైపూరియాతో పాటు అమెరికాకు చెందిన ఒక ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

# పగబట్టిన నాగుపాము

**ఒకే వ్యక్తిని నెలలో 7 సార్లు కాటేసిన పాము**

**జగిత్యాల జిల్లాలో వింత ఘటన**

**బాధితుడు గొల్లపల్లి మండలం బొంకూరు వాసిగా గుర్తింపు**



జగిత్యాల టౌన్, నవంబర్ 5 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో ఓ వింత ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. సినిమాల్లో చూపించినట్టు పాములు పగబడతాయనే నమ్మకాన్ని నిజం చేసేలాంటి ఈ ఉదంతం గొల్లపల్లి మండలం, బొంకూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఓ యువకుడిని నెల రోజుల వ్యవధిలో ఒక పాము ఏకంగా ఏడుసార్లు కాటు వేయడం గ్రామస్థులను ఆశ్చర్యానికి, భయానికి గురిచేస్తోంది. వివరాల్లోకి వెళితే, బొంకూరు గ్రామానికి చెందిన 28 ఏళ్ల యువకుడు వృత్తిరీత్యా డ్రైవర్. గత నెలలో అతడిని ఓ పాము కాటేసింది. వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుని ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అయితే ఇంటికి వచ్చిన కొద్ది రోజులకే మళ్లీ పాముకాటుకు గురయ్యాడు. ఇలా ఒకసారి కాదు, రెండుసార్లు కాదు.. నెల రోజుల వ్యవధిలో ఏడుసార్లు పాము అతడిని కాటు వేసింది. ప్రతిసారి ఆసుపత్రి నుంచి ఇంటికి రాగానే పాము కాటు వేస్తుండటంతో ఆ యువకుడితో పాటు కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పాము పగబట్టి తమ కుమారుడిని వెంటాడుతోందని, ఎక్కడి నుంచి వచ్చి కాటు వేస్తుందో కూడా తెలియడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామూలు సమయాల్లో ఇంటి పరిసరాల్లో ఎక్కడా పాము కనిపించకపోవడం వారి భయాన్ని మరింత పెంచుతోంది. ఈ వింత ఘటన గురించి గ్రామంలో తెలియడంతో స్థానికులు కూడా ఆశ్చర్యపోతున్నారు. పాము పగబట్టిందేమోనని చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం బాధితుడు చికిత్స పొందుతున్నాడు. అయితే, ఎక్కడి నుంచి వచ్చి ఆ పాము కాటు వేస్తుందో తెలియక ఆ కుటుంబం బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది.

# రాజన్న గుడిలో ఘనంగా కార్తీక పౌర్ణమి



వేములవాడ, నవంబర్ 5 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుచున్న కార్తీక మాస కార్యక్రమాలలో భాగంగా బుధవారం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భీమేశ్వర ఆలయం, భీమేశ్వర సదన్ పరిసర ప్రాంతాలలో సామూహిక లక్ష దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమెతో పాటు ఎస్పీ మహేష్ బి గీతే, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో రమాదేవి, ఆర్డీఓ రాధాబాయి, అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బంది, సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కార్తీక దీపోత్సవం లో పాల్గొన్న సుహాసినీలకు ఆలయ అర్చకులు, అధికారులు వాయనం, పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు మరియు స్వామివారి ఫోటోలను అందజేశారు.

# కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం

**దుబ్బాకలోనూ నిర్మిస్తాం**

**టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు**



హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): తిరుమల దేవదేవుడి పవిత్రతను పెంచాలనేది బోర్డు నిర్ణయమని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. 'గతంతో పోలిస్తే తిరుమల అన్నప్రసాదాల్లో మార్పులు వచ్చాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన పదార్థాలతో రుచికరమైన భోజనం అందిస్తున్నాం. తిరుమలలో రోజూ 1.5లక్షల నుంచి 2లక్షల మంది భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. లడ్డూ ప్రసాదంలో కూడా చాలా మార్పులు వచ్చాయి. ప్రసాదాలు పది రోజులైనా నిల్వ ఉంటున్నాయని భక్తులు చెబుతున్నారు. తిరుపతి స్థానికులకు నెలకోసారి తొలి మంగళవారం 3వేల మందికి దర్శనం కల్పిస్తున్నాం. తిరుమలలోని కాటేజ్‌లకు గతంలో సొంత పేర్లు పెట్టుకున్నారు. వాటిని తొలగించి దేవుడి పేర్లు పెట్టాలని నిర్ణయించాం. మొదటి బోర్డు మీటింగ్‌లోనే అన్యమతస్థులను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నాం.. కొందరిని తొలగించాం. ఏఐ సాంకేతికత సాయంతో 2గంటల్లోనే భక్తులకు దర్శనం ఏర్పాటు చేయాలని అనుకున్నాం.. కానీ, ఒక వర్గం ఏఐపై వ్యతిరేకత వ్యక్తం చేసింది. నూతన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో మళ్లీ ఏఐ ప్రాజెక్టును పట్టాలెక్కిస్తున్నాం. తిరుమల కొండపై రాజకీయాలు మాట్లాడితే చర్యలు తీసుకోవాలని తీర్మానించాం. టూరిజం ప్యాకేజీలను రద్దు చేసి ఆ టికెట్‌లను సామాన్య భక్తులకు ఇస్తున్నాం. శ్రీనివాస సేతు పేరు బదులుగా తిరుపతి ఫ్లైఓవర్‌కు గరుడ వారధి అని పెట్టాం. కొండని ఆనుకొనివున్న స్థలంలో ముంతాజ్ హోటల్‌కి గత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సీఎం చంద్రబాబు సహకారంతో ఆ హోటల్‌ను అక్కడి నుంచి తీసేయించి వేరే చోటికి మార్చాం. తిరుమలలో దాదాపు 1500 దుకాణాలకు ఇష్టా రాజ్యంగా అనుమతులు ఇచ్చారు. వాటన్నింటినీ క్రమబద్ధీకరిస్తున్నాం. బ్రేక్ దర్శనాలు మొన్నటి వరకు 10.30కి ఉండేవి.. ఇప్పుడు వాటిని తిరిగి తెల్లవారుజాముకి మార్చాం. అలిపిరి టోల్‌గేట్ వద్ద కొత్త సాంకేతికత ఏర్పాటు చేస్తున్నాం. శ్రీవాణి ట్రస్ట్ కింద 5వేల ఆలయాలు నిర్మించాలని తీర్మానించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాలు, భజన మందిరాలు నిర్మిస్తాం. టీటీడీకు 100 ఎలక్ట్రిక్ బస్సులు ఇస్తామని కేంద్రమంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారు. వాటిని తిరుపతి, తిరుమల మధ్య నడపాలి అనుకుంటున్నాం. టీటీడీ పరిధిలో ఉండే ఆలయాల్లో నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రతి రాష్ట్ర రాజధానిలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలు రాజధానిలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఆమోదం తెలిపాయి. ఒంటిమిట్టలో 100 గదుల వసతి గృహం నిర్మాణం చేయలని నిర్ణయించాం. వెంకటేశ్వర గోశాల నిర్వహణ మెరుగుపరచడంపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశాం. నివేదిక వచ్చిన తరువాత కార్యాచరణ ఉంటుంది. సిమ్స్ ఆసుపత్రిలో మెడికల్ మాఫియా నడుస్తుంది.. ఆసుపత్రే మెడికల్ షాప్స్ నిర్వహించాలని నిర్ణయించాం. తిరుపతి ఎయిర్‌పోర్టుకు శ్రీవెంకటేశ్వర ఎయిర్ పోర్ట్ అని నామకరణం చేయాలని కోరుతున్నాం. పేరుతో పాటు ఎయిర్ పోర్ట్‌ని ఆలయం సెట్ లాగా ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతి ఎయిర్ పోర్ట్ అంటే వెంకటేశ్వర స్వామి ఆలయం గుర్తు వచ్చేలా తీర్చిదిద్దుతాం. తిరుమలపై అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. టికెట్ల జారీలో సైబర్ నేరాలకు పాల్పడిన వారిని తొలగించి.. సైబర్ సెక్యూరిటీ ల్యాబ్‌ని ఏర్పాటు చేశాం. అన్నమయ్య జన్మించిన తాళ్లపాకను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. టీటీడీ కొనుగోళ్ల విభాగంలో జరిగిన అవకతవకలపై ఏసీబీ విచారణకు ఆదేశించాం. రూ.30 కోట్లతో కరీంనగర్‌లో, రూ.4.5 కోట్లతో దుబ్బాకలో శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నాం" అని పేర్కొన్నారు.



## వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ, నవంబర్ 5 (ఈవార్తలు): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం, భీమేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల తాకిడి భారీగా పెరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాక, ఇతర రాష్ట్రాల నుండి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్న దర్శనానికి తరలివచ్చారు. పవిత్ర కార్తీక మాసంలో, అందులోనూ పౌర్ణమి రోజు కావడంతో భక్తులు ముందుగా ఆలయ ఆవరణలోని ధర్మగుండంలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రస్తుతం ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నందున, భక్తులకు లఘు దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. అయినప్పటికీ, స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో ఓపికగా వేచి చూశారు. భక్తులు రాజన్నతో పాటు ఆలయ సముదాయంలోని శ్రీ భీమేశ్వరాలయంలో కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొందరు భక్తులు కోడె మొక్కులు చెల్లించుకోగా, మరికొందరు శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు, కళ్యాణం వంటి మొక్కులను కూడా తీర్చుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో భక్తులతో సందడి కనిపించింది.

## శ్రీశైలంలో వైభవంగా జ్వాలాతోరణం



శ్రీశైలం, నవంబర్ 5 (ఈవార్తలు): ప్రముఖ జ్యోతిర్లింగం, శక్తిపీఠమైన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం శ్రీశైలంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆలయం ఎదుట గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణోత్సవం నిర్వహించారు. అంతకు ముందు జ్వాలాతోరణానికి ఉపయోగించే వొత్తులను ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్లకు సమర్పించారు. నూలు పోగువొత్తులను ప్రకాశం జిల్లా వేటపాలం మండలం ఆమోదగిరిపట్నంకి చెందిన వసుందరరావు కుటుంబీకులతో వచ్చి ఆలయానికి అప్పగించడం సాంప్రదాయంగా వస్తుందని తెలిపారు. ఈ జ్వాలాతోరణోత్సవాన్ని తిలకించి భస్మాన్ని నుదుటిన ధరించడంతో సకల గ్రహపీడలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఉత్తర దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులతో క్షేత్ర పురవీధులు సందడిగా మారాయి. త్రిపురాసురులను సంహరించిన తరువాత పరమేశ్వరుని దృష్టిదోషనివారణ కోసం పార్వతీదేవి తొలిసారిగా జ్వాలాతోరణోత్సవాన్ని జరిపించినట్లు పురాణ ఇతిహాసాల్లో ఉన్నందున శ్రీశైల క్షేత్రంలో కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఈవో లవన్న చెప్పారు. సాయంత్రం ఆలయ ప్రధాన గోపురం గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో తీసుకువచ్చి దీపప్రజ్వలన కార్యక్రమాన్ని జరిపించినట్లు ఈవో తెలిపారు.



## నారా భువనేశ్వరికి రెండు అంతర్జాతీయ అవార్డులు

లండన్: ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రెండు అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. లండన్‌లోని మే ఫెయిర్ హాలులో జరిగిన ఓ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్(ఐఓడీ) ప్రతినిధుల చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డును నారా భువనేశ్వరికి ఐఓడీ ప్రతినిధులు అందజేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో ప్రజాసేవ –సామాజిక సాధికారత రంగాల్లో చేసిన విశేష కృషికి గానూ నారా భువనేశ్వరికి ఈ అవార్డును అందజేశారు. అలాగే హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్' విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డునూ ఇదే వేదికపై నారా భువనేశ్వరికి నిర్వాహకులు అందజేశారు. నారా భువనేశ్వరి అంతర్జాతీయ అవార్డులు అందుకోవడం పట్ల నందమూరి బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు భువనేశ్వరి దూరదృష్టి, కృషి, సేవాభావానికి నిదర్శనమని కొనియాడారు. భువనేశ్వరి విలువలు, సేవాస్ఫూర్తి మనందరికీ ఆదర్శం, ప్రేరణ అని అన్నారు.

## పంచాయతీ సెక్రటరీ ఇక డెవలప్‌మెంట్ ఆఫీసర్

అమరావతి, నవంబర్ 5 (ఈవార్తలు): ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి పోస్టులను గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీపీడీవో)గా మార్చింది.. అలాగే గ్రామ పంచాయతీ కార్యదర్శులు తీసుకునే వేతనాల్లో ఎలాంటి మార్పులు చేయకుండా, ప్రస్తుతం ఉన్న ఐదు కేడర్‌లను నాలుగు కేడర్‌లకు కుదించింది. జనాభా, వార్షికాదాయం ప్రాతిపదికన రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలను కొత్తగా వర్గీకరిస్తూ గత నెల 10వ తేదీన ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన అంశాలతో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం జీవో జారీ చేశారు. దీని ప్రకారం ఇప్పటివరకు అమలులో ఉన్న 7244 క్లస్టర్ గ్రామ పంచాయతీల స్థానంలో 13,351 గ్రామ పంచాయతీలు పనిచేయనున్నాయి. వీటిని 359 అర్బన్ పంచాయతీలు, 3082 గ్రేడ్ 1 పంచాయతీలు, 3163 గ్రేడ్ 2 పంచాయతీలు, 6747 గ్రేడ్ 3 పంచాయతీలుగా వర్గీకరించారు. వీటికి సంబంధించి సమగ్ర వివరాలతో ప్రత్యేక ఆదేశాలను ఇస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పుట్టపర్తికి 200 ప్రత్యేక బస్సులు

**సత్యసాయి సెంట్రల్ ట్రస్టుతో ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ భేటీ**

**భక్తులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా చర్యలు**

**సత్యసాయి శత జయంత్యుత్సవాలు 23న పుట్టపర్తిలో ప్రారంభం**



పుట్టపర్తి, నవంబర్ 5 (ఈవార్తలు): శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా 200 ప్రత్యేక బస్సులు పుట్టపర్తికి నడపనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. నిన్న ఆయన శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిని సందర్శించి, వేడుకల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు ప్రశాంతి నిలయంలోని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులతో సమావేశమయ్యారు. శత జయంతి వేడుకలకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి రవాణా ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండును అధికారులతో కలిసి పరిశీలించారు. శత జయంతి ఉత్సవాలకు పుట్టపర్తికి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని ద్వారకా తిరుమలరావు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైతే మరిన్ని సర్వీసులు నడిపేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. కాగా, శ్రీసత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలు ఈ నెల 23న పుట్టపర్తిలో అధికారికంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలను రాష్ట్ర పండుగగా జరపాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ వేడుకల్లో 185 దేశాలకు చెందిన వారు పాల్గొంటారు. ఈ వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు డిప్యూటీ సీఎంలు, మంత్రులు పాల్గొంటారు.

# తొక్కిసలాటల సీఎం

**బాబు సీఎం అయినప్పుడల్లా విషాద ఘటనలు**

**మాజీమంత్రి బొత్సనారాయణ ఘాటు విమర్శ**



అమరావతి, నవంబర్ 5 (ఈవార్తలు): ఏపీలో కూటమి ప్రభుత్వానికి బాధ్యత లేకుండా వ్యవహరిస్తుందని వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ముఖ్యంగా చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా కాశీబుగ్గ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయని విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాశీబుగ్గ వేంకటేశ్వస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది మృతి చెందితే ఆలయం ప్రైవేట్ ఆలయమని పేర్కొనడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. ఎక్కువ మంది భక్తులు వస్తారని ప్రభుత్వానికి అంచనా లేదా అని ప్రశ్నించారు. తిరుపతి, సింహాచలం ఘటన నుంచి ప్రభుత్వం ఏం నేర్చుకుందని, ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ పాలన వల్ల ప్రజల జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయని విమర్శించారు. ప్రకృతి విపత్తు జరిగినప్పుడు ప్రభుత్వ విధానం బాధాకరంగా ఉందని వెల్లడించారు. తుపాను పంట నష్టంపై ప్రభుత్వానికి స్పష్టత లేదని విమర్శించారు. వైఎస్ జగన్ పాలనలో రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వమే రైతులకు బీమా చెల్లించి పంట నష్ట పరిహారాన్ని అందజేసిందని గుర్తు చేశారు. ఇటీవల మొంథా తుపాను వల్ల అన్ని రకాల పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పటివరకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించకపోవడం దురదృష్టకరమని ఆరోపించారు. లక్షలాధి కోట్లను అప్పులు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతుల బీమాను ఎందుకు కట్టడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రతిపక్షాలపై నెపాన్ని వేస్తున్నారని మండిపడ్డారు.

## కాలేజీల బంద్‌పై తగ్గం

**ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య**

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు బంద్ కొనసాగిస్తామని తెలంగాణ ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. గత నాలుగు రోజులుగా బంద్ చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చర్చలకు పిలిచిందని చెప్పారు. "జేఎన్‌టీయూ, ఉస్మానియా పరిధిలో నిర్వహిస్తున్న పరీక్షలను కళాశాలలు బహిష్కరించాయి. కళాశాల విద్య కమిషనర్ దేవసేన ఎంత వేధిస్తున్నా భరించాం. ఆమెను ఆ విభాగం నుంచి బదిలీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరాం. ఫీజు బకాయిల్లో 50 శాతం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మా డిమాండ్‌లను పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం. ఎల్బీ స్టేడియంలో ఈనెల 8న కళాశాలల అధ్యాపకుల సభ నిర్వహిస్తాం. సుమారు 70వేల మంది దీనికి హాజరవుతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నాం. మూడు నెలలకు బదులు ఒక నెలలోనే కమిటీ రిపోర్టు అడగాలి. మార్చి నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి. కాలేజీలపై విజిలెన్స్ దాడుల్లో నియంతృత్వ ధోరణి కనిపిస్తోంది. ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే 10లక్షల మంది విద్యార్థులతో భారీ సభ నిర్వహిస్తాం" అని అన్నారు.

## కూతురి కిడ్నాప్‌కు తల్లిదండ్రుల యత్నం

వెల్గటూర్ (జగిత్యాల), నవంబర్ 5 (ఈవార్తలు): ఆరేళ్లు ప్రేమించుకొని ఇటీవలే కులాంతర వివాహం చేసుకున్న కూతురిని కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశారు తల్లిదండ్రులు. వివరాల్లోకి వెళ్తే..జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజక్కపల్లికి చెందిన మర్రి రాకేష్‌తో పెద్దపెల్లి జిల్లా పాలకుర్తికి చెందిన ప్రియాంక ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కులాంతర వివాహానికి ప్రియాంక తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో వారు ఓ గుడిలో పెళ్లి చేసుకున్నారు. అయితే కొన్ని నెలల తర్వాత ప్రియాంకకు ఆమె తల్లి ఫోన్ చేసి మాట్లాడి కలిసిపోయినట్లు నటించారు. హాస్పిటల్‌లో చూపించేందుకు కూతురు రాగా, తానూ వస్తానని తల్లి వెళ్లింది. అక్కడికి వెళ్లాక ప్రియాంకను ఆమె తల్లిదండ్రులు, బావ కిడ్నాప్ చేయడానికి యత్నించారు. స్థానికుల సాయంతో అక్కడి నుంచి తప్పించుకున్న ప్రియాంక.. తల్లిదండ్రులు, బావపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.




## రేపు అఖండ2 'తాండవం' ఫస్ట్ సింగిల్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, మాస్ చిత్రాల డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'అఖండ 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 5న విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ఇప్పటికే టీజర్‌తో హైప్ క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'తాండవం' నవంబర్ 7న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. థమన్ అందించిన ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని టీమ్ చెబుతోంది. మేకర్స్ పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రమోషన్ ప్లాన్ చేస్తున్నారు. బోయపాటి యాక్షన్ టచ్, బాలయ్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలయికగా 'అఖండ 2' బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలుస్తుందనే అంచనాలు ఉన్నాయి.

# చాట్‌జీపీటీ ఉద్యోగ నియామకాలు

## బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాల ప్రారంభం.. సొల్యూషన్ ఇంజనీర్ల పోస్టుల భర్తీ ప్రక్రియకు శ్రీకారం

**అమెరికా తర్వాత భారతే తమకు**

**అతిపెద్ద మార్కెట్ అన్న ఓపెన్ ఏఐ**




బెంగళూరు: ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ రంగంలో సంచలనాలు సృష్టిస్తున్న ఏఐ చాట్‌బాట్ 'చాట్‌జీపీటీ' మాతృసంస్థ ఓపెన్‌ఏఐ, ఇప్పుడు భారత మార్కెట్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. యూజర్ల సంఖ్య పరంగా అమెరికా తర్వాత అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా బెంగళూరు కేంద్రంగా ఉద్యోగ నియామకాలను ప్రారంభించినట్లు కంపెనీ ప్రతినిధులు ధృవీకరించారు. ఇటీవల బెంగళూరులో జరిగిన ఓ సమావేశంలో ఓపెన్‌ఏఐ బిజినెస్ అప్లికేషన్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ శ్రీనివాస్ నారాయణన్, గ్లోబల్ అఫైర్స్ హెడ్ ప్రజ్ఞా మిశ్రా పాల్గొన్నారు. ఈ ఏడాది ఆగస్టులోనే భారత్‌లో తమ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామని, తొలి ఏడాదిలో ఓ సమర్థవంతమైన చిన్న బృందాన్ని నిర్మించడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. ప్రస్తుతం సొల్యూషన్ ఇంజనీర్ల పోస్టులను భర్తీ చేస్తున్నామని, బెంగళూరు వేదికగా డెవలపర్లతో సంబంధాలను మరింత బలోపేతం చేయనున్నామని వివరించారు. స్థానిక స్టార్టప్‌లతో కలిసి పనిచేస్తున్నామని ప్రజ్ఞా మిశ్రా పేర్కొన్నారు. ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ కూడా గతంలో మాట్లాడుతూ, తమ కంపెనీకి అమెరికా తర్వాత భారతే అతిపెద్ద మార్కెట్ అని స్పష్టం చేశారు. భారత యూజర్లను ఆకట్టుకునేందుకు ఇటీవలే 12 నెలల పాటు 'చాట్‌జీపీటీ గో' ప్లాన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. కేవలం సేవలే కాకుండా, దేశంలో భారీ పెట్టుబడులకు కూడా సంస్థ సిద్ధమవుతోంది. భవిష్యత్ అవసరాల కోసం భారత్‌లో 1 గిగావాట్ సామర్థ్యంతో ఓ భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఓపెన్‌ఏఐ సన్నాహాలు చేస్తోంది. దీనికోసం స్థానిక భాగస్వాములతో చర్చలు జరుపుతోంది. ఈ విస్తరణ ప్రణాళికల్లో భాగంగానే ప్రస్తుతం నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. ఆసక్తిగల అభ్యర్థుల కోసం తమ అధికారిక కెరీర్స్ పేజీలో ఉద్యోగ వివరాలను అందుబాటులో ఉంచింది.



## కేంద్ర మంత్రి లలన్ సింగ్‌పై ఎఫ్ఐఆర్

పాట్నా: బీహార్‌లో తొలిదశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ముందు కేంద్ర మంత్రి, జేడీయూ సీనియర్ నేత రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. మొకామా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో లాలన్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అయింది. "పోలింగ్ రోజు కొందరు నాయకులను ఇళ్ల నుంచి బయటకు రాకుండా చూడాలి. ఒకవేళ వాళ్లు మరీ బతిమాలితే, మీతోపాటే తీసుకెళ్లి ఓటు వేయించి, తిరిగి ఇంటికి తీసుకొచ్చి పడుకోబెట్టండి. వాళ్లను ఇంట్లోనే ప్యాక్ చేయాలి. సమయం లేదు, ఇప్పుడే బాధ్యతలు తీసుకోండి" అని ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై ప్రధాన ప్రతిపక్షమైన రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) తీవ్రంగా పరిగణించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. "లలన్ సింగ్ ఎన్నికల సంఘం చాతీపై బుల్డోజర్ నడుపుతున్నారు. నేతలను ఇంట్లో బంధించి, బతిమాలితే ఓటుకు తీసుకెళ్లమని చెబుతున్నారు. ఈసీ ఎక్కడుంది?" అని ఆర్జేడీ తీవ్రంగా విమర్శించింది. ఆర్జేడీ ఫిర్యాదుతో స్పందించిన ఈసీ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో భారతీయ న్యాయ సంహిత, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని పలు సెక్షన్ల కింద పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. లలన్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ముంగేర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకే మొకామా అసెంబ్లీ సెగ్మెంట్ వస్తుంది. ఇక్కడి నుంచి జేడీయూ అభ్యర్థిగా బరిలో ఉన్న అనంత సింగ్‌పై ఇప్పటికే అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయి. వివాదాస్పద అభ్యర్థి కోసం ప్రచారం చేయడంపై ఎన్డీటీవీ నిన్న లలన్ సింగ్‌ను ప్రశ్నించగా "దోషి ఎవరో మీరెలా నిర్ణయిస్తారు? నన్ను కూడా అరెస్ట్ చేయొచ్చు. అంతమాత్రాన నేను నేరస్తుడిని అయిపోతానా? పోలీసులు విచారణ చేస్తారు. చాలా మంది తర్వాత నిర్దోషులుగా బయటపడతారు" అని ఆయన సమాధానమిచ్చారు.

# పాపం ట్రంప్.. ఘోర పరాభవం

**రిపబ్లికన్ పార్టీ నేతల ఓటమి**

**జేడీ వాన్స్ తమ్ముడికీ పరాభవం**



వాషింగ్టన్: అమెరికా స్థానిక ఎన్నికల్లో ఫలితాలు అమెరికాలోని అధికార రిపబ్లికన్ పార్టీకి ఊహించని షాకిచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఓటర్లు ఝలక్ ఇచ్చారు. అధికార పార్టీకి చెందిన కీలక నేతలను ఓడించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై తాజాగా ట్రంప్ స్పందించారు. ట్రుత్ వేదికగా స్పందిస్తూ.. ఎన్నికల బ్యాలెట్ పేపర్‌లో ట్రంప్ ఫొటో లేదు. అమెరికాలో షట్‌డౌన్ ఉంది. ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నేతలు ఓడిపోవడానికి ఇవే రెండు ముఖ్య కారణాలు అని చెప్పుకొచ్చారు. దీంతో, ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు సెటైరికల్ కామెంట్స్ చేస్తున్నారు. వర్జీనియాలో ట్రంప్ రిపబ్లికన్ పార్టీకి ఇక్కడ ఎదురు దెబ్బ తగిలింది. రిపబ్లికన్ పార్టీ సీయర్స్ ఓటమి పాలవ్వగా.. డెమోక్రాట్ అభ్యర్థి అబిగైల్ స్పాన్‌బర్గర్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. అబిగైల్ కు 14.80 లక్షల ఓట్లు పోలవ్వగా, సీయర్స్ కు 11.61 లక్షల ఓట్లు వచ్చాయి. అబిగైల్ 3.20 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. వర్జీనియా చరిత్రలో మొదటి మహిళా గవర్నర్ గా అబిగైల్ చరిత్ర సృష్టించారు. మరోవైపు సిన్సినాటి మేయర్ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సవతి తమ్ముడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కోరీబౌమన్ కూడా ఓడిపోయారు. ఈయనపై డెమొక్రాట్ అఫ్తాబ్ పురేవాల్ గెలుపొందారు. పురేవాల్ రెండవ సారి మేయర్ గా ఎన్నికయ్యారు. తొలిసారి 2021లో మేయర్‌గా ఎన్నికయ్యారు. మే నెలలో జరిగిన ఆల్ పార్టీ మున్సిపల్ ప్రైమరీలో ఆయన 80% కంటే ఎక్కువ ఓట్లతో గెలిచారు.

### రిపబ్లికన్లకు పరాభవం

**గవర్నర్, మేయర్ ఎన్నికల్లో పలుచోట్ల రిపబ్లికన్ పార్టీ ఓటమి**

**వర్జీనియా ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి ఓటమి**

**వర్జీనియా గవర్నర్‌గా డెమోక్రాట్ అభ్యర్థి అబిగైల్ స్పాన్‌బర్గర్**

**వర్జీనియా తొలి మహిళా గవర్నర్‌గా అబిగైల్ స్పాన్‌బర్గర్ రికార్డు**

**సిన్సినాటి మేయర్‌గా డెమోక్రాట్ అభ్యర్థి అఫ్తాబ్ పురేవాల్ గెలుపు**

**అట్లాంటా మేయర్‌గా డెమోక్రాట్ అభ్యర్థి ఆండ్రీ డికెన్స్ తిరిగి ఎన్నిక**

**పిట్స్‌బర్గ్ మేయర్ రేసులో డెమోక్రాట్ అభ్యర్థి కోరీ ఓకానర్ విజయం**

# అంతరిక్షంలో ఏఐ డేటా సెంటర్లు

**గూగుల్ సంచలన ప్రకటన!**

**'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్' పేరుతో కార్యక్రమం**

**సౌరశక్తితో టీపీయూ ఆధారిత శాటిలైట్ల పని**

**2027 నాటికి రెండు ప్రయోగాత్మక ఉపగ్రహాల ప్రయోగం**



న్యూయార్క్: టెక్నాలజీ దిగ్గజం గూగుల్ మరో భారీ ప్రయోగానికి తెరతీసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోసం ఏకంగా అంతరిక్షంలోనే డేటా సెంటర్లను నిర్మించేందుకు పరిశోధనలు ప్రారంభించినట్లు సంచలన ప్రకటన చేసింది. 'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్' పేరుతో ఈ 'మూన్‌షాట్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించింది. భవిష్యత్తులో ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించడంలో ఈ ప్రాజెక్ట్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనుందని కంపెనీ భావిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా, గూగుల్ తన టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్స్ (టీపీయూ)లను అంతరిక్షంలోకి పంపనుంది. సౌరశక్తితో పనిచేసే చిన్నపాటి ఉపగ్రహాల సమూహాన్ని ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఏఐ డేటా సెంటర్లను నడపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఉపగ్రహాలను ఒకదానికొకటి ఫ్రీ-స్పేస్ ఆప్టికల్ లింక్స్ ద్వారా అనుసంధానిస్తారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ అంతరిక్షంలో భారీ డేటా సెంటర్లు రానున్నాయని అంచనా వేసిన కొన్ని వారాలకే గూగుల్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఈ సందర్భంగా గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ మాట్లాడుతూ.. "మా టీపీయూలు అంతరిక్షంలోకి వెళ్తున్నాయి. క్వాంటం కంప్యూటింగ్, అటానమస్ డ్రైవింగ్ లాంటి మా మూన్‌షాట్ ప్రాజెక్టుల స్ఫూర్తితో 'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్'ను ప్రారంభించాం. సౌరశక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని అంతరిక్షంలో ఏఐ వ్యవస్థలను ఎలా నిర్మించవచ్చో అన్వేషిస్తున్నాం" అని తెలిపారు. 2027 ప్రారంభం నాటికి ప్లానెట్ సంస్థ భాగస్వామ్యంతో రెండు ప్రయోగాత్మక ఉపగ్రహాలను ప్రయోగించడమే తమ తదుపరి లక్ష్యమని ఆయన వివరించారు. ఏఐ అల్గారిథమ్‌లకు అపారమైన విద్యుత్ శక్తి అవసరం. భూమిపై ఈ విద్యుత్ అవసరాలు పర్యావరణంపై భారం మోపుతున్నాయి. దీనికి పరిష్కారంగా గూగుల్ అంతరిక్షాన్ని ఎంచుకుంది. భూమి మీద కంటే అంతరిక్షంలోని సరైన కక్ష్యలో ఉండే సోలార్ ప్యానెల్ 8 రెట్లు ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తుంది. దాదాపు నిరంతరాయంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. బ్యాటరీల అవసరం కూడా తగ్గుతుంది. భూమిపై వనరుల వినియోగాన్ని తగ్గించి, ఏఐ పూర్తి సామర్థ్యాన్ని వాడుకోవాలంటే అంతరిక్షమే సరైన ప్రదేశమని గూగుల్ తన ప్రకటనలో పేర్కొంది. అయితే, ఈ ప్రాజెక్టులో రేడియేషన్, థర్మల్ మేనేజ్‌మెంట్, సిస్టమ్ విశ్వసనీయత వంటి అనేక సాంకేతిక సవాళ్లు ఉన్నాయి. ఇప్పటికే తమ ట్రిలియం-జనరేషన్ టీపీయూలు భూమికి సమీప కక్ష్యలోని రేడియేషన్‌ను తట్టుకోగలవని ప్రయోగాల్లో తేలినట్లు గూగుల్ తెలిపింది. ఈ సవాళ్లను అధిగమించి, భవిష్యత్తులో అంతరిక్ష ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించే దిశగా గూగుల్ తన పరిశోధనలను ముమ్మరం చేస్తోంది.

# నేడు బీహార్ తొలి దశ పోలింగ్

**బరిలో తేజస్వి, 16 మంది మంత్రులు**

**18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్**

**రాఘోపూర్ నుంచి పోటీలో తేజస్వి యాదవ్**



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన తొలి దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్ జరగనుంది. ఈ దశలో మొత్తం 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, పలువురు ప్రముఖ నేతల భవితవ్యం తేలనుంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు పోలింగ్‌పైనే కేంద్రీకృతమైంది. ముఖ్యంగా హోరాహోరీ పోరు నెలకొన్న కీలక నియోజకవర్గాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కేబినెట్‌లోని 16 మంది మంత్రులు ఈ దశలో తమ స్థానాలను నిలబెట్టుకునేందుకు పోటీ పడుతున్నారు. వీరిలో 11 మంది బీజేపీ కోటాకు చెందినవారు కాగా, ఐదుగురు జేడీ(యూ) మంత్రులు ఉన్నారు. ఈ ఎన్నికలు నితీశ్ ప్రభుత్వ పాలన, విశ్వసనీయతకు ఒకరకంగా అగ్నిపరీక్షగా మారాయి. మరోవైపు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఆయన సోదరుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా తమ స్థానాల్లో గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. ఈ ఎన్నికల్లో పలు నియోజకవర్గాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ముంగేర్ జిల్లాలోని తారాపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఆర్జేడీ అభ్యర్థి అరుణ్ కుమార్ షాతో పాటు, జన్ సురాజ్, జన్ తంత్రిక్ జనతాదళ్ అభ్యర్థులు కూడా బరిలో ఉండటంతో చతుర్ముఖ పోరు నెలకొంది. వైశాలి జిల్లాలోని రాఘోపూర్, తేజస్వి యాదవ్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. ఇక్కడ ఆయన ఎన్డీయే అభ్యర్థి సతీశ్ యాదవ్‌ను ఢీకొంటున్నారు. పాట్నా రూరల్ పరిధిలోని మొకామా స్థానం, దులార్‌చంద్ యాదవ్ హత్య కేసు నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడ జేడీ(యూ) నుంచి అనంత్ సింగ్, ఆర్జేడీ నుంచి వీణా దేవి పోటీ పడుతున్నారు. ఇద్దరూ బలమైన రాజకీయ కుటుంబాలకు చెందిన వారు కావడంతో పోరు రసవత్తరంగా మారింది. ఈ ఎన్నికల్లో కళారంగానికి చెందిన ప్రముఖులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రముఖ జానపద గాయని మైథిలి ఠాకూర్‌ను బీజేపీ దర్భంగా జిల్లాలోని అలీనగర్ నుంచి బరిలోకి దించింది. ఆమె ఆర్జేడీ అభ్యర్థి వినోద్ మిశ్రాతో తలపడుతున్నారు. మిథిలాంచల్ ప్రాంతంలో మైథిలికి ఉన్న ప్రజాదరణ ఆమెకు ఎంతవరకు కలిసొస్తుందో చూడాలి. భోజ్‌పురి సూపర్ స్టార్ కేసరి లాల్ యాదవ్ సారన్ జిల్లాలోని ఛాప్రా నుంచి ఆర్జేడీ తరఫున పోటీ చేస్తున్నారు. ఇక, లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కాంగ్రెస్ అభ్యర్థితో తలపడుతూ వరుసగా మూడో విజయంపై కన్నేశారు. బేగుసరాయ్‌లో బీజేపీ అభ్యర్థి కుందన్ కుమార్‌కు, కాంగ్రెస్‌కు చెందిన అమితా భూషణ్‌కు మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ కుల సమీకరణాలు కీలకం కానున్నాయి. పాట్నాలోని పట్టణ నియోజకవర్గమైన బకీపూర్‌లో బీజేపీ నేత నితిన్ నబిన్ మరోసారి పోటీ చేస్తున్నారు.

## అమెరికాలో విమానం కూలి ఏడుగురు మృతి

లూయిస్‌విల్లే: అమెరికాలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. లూయిస్‌విల్లే నగరంలో టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో ఓ కార్గో విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారికంగా ధ్రువీకరించింది. వివరాల్లోకి వెళితే.. యూపీఎస్‌కు చెందిన ఫ్లైట్ నంబర్ 2976 కార్గో విమానం లూయిస్‌విల్లే నుంచి హోనులులుకు బయలుదేరింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5:15 గంటలకు టేకాఫ్ అవుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాల్లోకి ఎగురుతున్న సమయంలో విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, అదుపుతప్పి కిందకు పడిపోయింది. మెక్‌డొనెల్ డగ్లస్ ఎండీ-11 రకానికి చెందిన ఈ విమానం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విమానం గాల్లో ఉండగానే మంటల్లో చిక్కుకుని కూలిపోతున్న వీడియోలు పలువురిని కలచివేస్తున్నాయి. ప్రమాద సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించాయి.

## వర్జీనియా లెఫ్ట్‌నెంట్ గవర్నర్‌గా హైదరాబాదీ

**భారత సంతతి మహిళ గజాలా హష్మి గెలుపు**

**హైదరాబాద్‌లోని మలక్‌పేటలో జన్మించిన గజాలా హష్మి**

**వర్జీనియా సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లిం, దక్షిణాసియా మహిళ ఈమె**

**2019లో రాజకీయాల్లోకి వచ్చి అనూహ్య విజయాలు సాధించిన గజాలా**



హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): అమెరికా రాజకీయాల్లో భారత సంతతికి చెందిన, అందులోనూ హైదరాబాద్ మూలాలున్న మరో మహిళ సత్తా చాటారు. డెమొక్రాట్ పార్టీకి చెందిన గజాలా హష్మి వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన పోరులో ఆమె రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ రీడ్‌పై గెలుపొందారు. ఈ విజయంతో గజాలా గతంలో ప్రాతినిధ్యం వహించిన 15వ సెనెటోరియల్ డిస్ట్రిక్ట్ స్థానానికి ఇప్పుడు ప్రత్యేక ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. 2019లో రాజకీయాల్లోకి ప్రవేశించిన గజాలా హష్మి, అనూహ్య రీతిలో రిపబ్లికన్ల అధీనంలో ఉన్న స్టేట్ సెనేట్ సీటును గెలుచుకుని సంచలనం సృష్టించారు. వర్జీనియా సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లిం, తొలి దక్షిణాసియా అమెరికన్‌గా ఆమె చరిత్ర సృష్టించారు. ఐదేళ్ల తర్వాత, 2024లో ఆమె సెనేట్ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ కమిటీకి ఛైర్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికై మరో ఉన్నత స్థాయికి చేరుకున్నారు. గజాలా హష్మి 1964లో హైదరాబాద్‌లోని మలక్‌పేటలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు జియా హష్మి, తన్వీర్ హష్మి. తన నాలుగో ఏట తల్లి, సోదరుడితో కలిసి అమెరికాలోని జార్జియాకు ఆమె వలస వెళ్లారు. ఆమె తండ్రి ప్రొఫెసర్ జియా హష్మి అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ పూర్వ విద్యార్థి కాగా, తల్లి తన్వీర్ హష్మి కోఠిలోని ఉస్మానియా యూనివర్సిటీ మహిళా కళాశాలలో చదువుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు గజాలా సుమారు 30 ఏళ్ల పాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఎమోరీ యూనివర్సిటీ నుంచి అమెరికన్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆమె భర్త అజహర్ రఫీక్. ఈ దంపతులకు యాస్మిన్, నూర్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విద్య, వైద్యం, గృహ వసతి, పర్యావరణం వంటి రంగాల్లో అసమానతలను రూపుమాపేందుకు కృషి చేస్తానని ఆమె తన వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.

## భార్యతో గొడవపడి.. కొడుకును బోర్డర్‌లో వదిలేసిన తండ్రి

**పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాల జిల్లాలో ఘటన**

**ఒంటరిగా ఏడుస్తున్న బాలుడిని కాపాడిన స్థానికులు**

**ఇంటికి చేర్చి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు**

నార్త్ 24 పరగణాలు: భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి కన్నకొడుకని కూడా చూడకుండా, పదేళ్ల బాలుడిని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ఈ అమానవీయ ఘటన పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాల జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. నార్త్ 24 పరగణాల జిల్లా, అశోక్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కత్‌పోల్ ప్రాంతానికి చెందిన పింటూ ఘోష్, మాధవి ఘోష్ దంపతులకు పదేళ్ల కుమారుడు ఉన్నాడు. అయితే, వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇటీవల గొడవ తీవ్రం కావడంతో, మాధవి తన కొడుకును అత్తగారింట్లో వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. మంగళవారం రాత్రి, పింటూ ఘోష్ తన కొడుకును తల్లి దగ్గర వదిలిపెట్టేందుకు అత్తగారింటికి వెళ్లాడు. అయితే, కొడుకును తన వద్ద ఉంచుకోవడానికి ఆమె నిరాకరించింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన పింటూ, కిరాతకమైన నిర్ణయం తీసుకున్నాడు. కొడుకు బట్టల బ్యాగుతో సహా బైక్‌పై ఎక్కించుకుని బసిర్‌హత్ ప్రాంతంలోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుకు తీసుకెళ్లాడు. అక్కడ నిర్మానుష్య ప్రాంతంలో బాలుడిని బైక్‌పై నుంచి దించేసి, చీకట్లోకి వేగంగా వెళ్లిపోయాడు. ఆకస్మిక పరిణామానికి షాక్‌కు గురైన ఆ చిన్నారి, చలికి వణుకుతూ భయంతో ఏడవడం మొదలుపెట్టాడు. బాలుడి ఏడుపు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని, అతడిని ఓదార్చి ఆహారం అందించారు. అనంతరం బసిర్‌హత్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చిన్నారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, అతని నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాలుడి తల్లిదండ్రులను సంప్రదించి, అతడిని సురక్షితంగా ఇంటికి చేర్చారు. "బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిన తల్లిదండ్రులిద్దరికీ కౌన్సెలింగ్ ఇస్తున్నాం" అని బసిర్‌హత్ జిల్లా సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

## బ్యాలెట్‌పై నేను లేను, అందుకే ఓడిపోయాం: ట్రంప్

అమెరికాలో జరిగిన కీలక ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ విజయదుందుభి మోగించింది. జనవరిలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా తిరిగి బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన ఈ మొదటి ప్రధాన ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. అయితే, ఈ ఓటమిపై అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. రిపబ్లికన్ల ఓటమికి గల కారణాలను ఆయన విశ్లేషించారు. తాను బ్యాలెట్‌పై లేకపోవడం, ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావమే ఓటమికి దారితీశాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఫలితాలపై ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో స్పందిస్తూ, "ట్రంప్ బ్యాలెట్‌పై లేరు, ప్రభుత్వ షట్‌డౌన్.. ఈ రాత్రి ఎన్నికల్లో రిపబ్లికన్లు ఓడిపోవడానికి ఈ రెండే కారణాలని పోల్‌స్టర్స్ చెబుతున్నారు" అని పోస్ట్ చేశారు. ఎన్నికలకు ముందు కూడా ట్రంప్ డెమోక్రాట్లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "డెమోక్రాట్లకు వేసే ఓటు మరణశాసనమే. రిపబ్లికన్లకు ఓటేయండి" అని ఆయన పిలుపునిచ్చారు. వర్జీనియా, న్యూజెర్సీ ఓటర్లను ఉద్దేశించి, రిపబ్లికన్లకు ఓటేస్తే ఇంధన ధరలు భారీగా తగ్గుతాయని, అదే డెమోక్రాట్లకు వేస్తే ధరలు రెట్టింపు, మూడింతలు, నాలుగు రెట్లు కూడా అవుతాయని హెచ్చరించారు. ముఖ్యంగా న్యూయార్క్ నగర మేయర్ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీపై ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. మమ్దానీ గెలిస్తే న్యూయార్క్ నగరానికి ఫెడరల్ నిధులు నిలిపివేస్తామని సోమవారం హెచ్చరించారు. "అనుభవం లేని కమ్యూనిస్ట్ అయిన మమ్దానీ గెలవడం కంటే, విజయవంతమైన రికార్డు ఉన్న డెమోక్రాట్ గెలవడమే మేలు" అని ఆయన వ్యాఖ్యానించారు. పిన్న వయస్కుడైన మేయర్‌గా ఆయన జనవరి 1న బాధ్యతలు స్వీకరించనున్నారు. మరోవైపు, ఎన్నికల ఫలితాల అనంతరం 'ట్రంప్ మీ అధ్యక్షుడు' అంటూ వైట్‌హౌస్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

## పనిలేక పాక్‌లో పస్తులు

**దాయాది దేశంలో తీవ్ర నిరుద్యోగం.. మూడో వంతు యువతకు ఉపాధి కరవు**

ఇస్లామాబాద్: పొరుగు దేశం పాకిస్థాన్ తీవ్ర నిరుద్యోగ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. దేశంలోని మూడింట ఒక వంతు యువత (15-35 ఏళ్ల మధ్య) ఎలాంటి ఉపాధి లేకుండా ఉన్నట్లు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో తొలిసారిగా నిర్వహించిన డిజిటల్ జనాభా లెక్కల ప్రకారం, నిరుద్యోగ రేటు 7.8 శాతంగా నమోదైంది. అంటే, మొత్తం 24.15 కోట్ల జనాభాలో దాదాపు 1.87 కోట్ల మందికి పని లేదని అర్థం. ఈ సంక్షోభం కనిపించే దానికంటే చాలా లోతుగా ఉంది. చదువు, ఉద్యోగం లేదా శిక్షణ వంటివి ఏవీ లేకుండా ఖాళీగా ఉన్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. వీరికి తోడు, మహిళల్లో ఉద్యోగ భాగస్వామ్యం ఈ ప్రాంతంలోనే అత్యంత తక్కువగా ఉండటం సమస్యను మరింత జటిలం చేస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో అక్కడి విద్యావ్యవస్థ విఫలమవుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇటీవల సంభవించిన వరదలు (2022, 2025), అధిక ద్రవ్యోల్బణం, విదేశీ మారక నిల్వల సంక్షోభం వంటివి చిన్న వ్యాపారాలను, స్థానిక ఉద్యోగ మార్కెట్లను దెబ్బతీశాయి.

## వయ్యారి చిత్రం



జీవప్రియా రెడ్డి



## కుంభమేళా మోనాలిసా తెలుగు ఫిలిం

మహా కుంభమేళ ద్వారా ఫేమస్ అయిన వారిలో తేనె కళ్ల సుందరి మోనాలిసాది ఫస్ట్ ప్లేస్. పలు షాపింగ్ మాల్ ఓపెనింగ్స్ లో పాల్గొంటూ సందడి చేస్తున్న ఈ బ్యూటీ.. మొన్న ఒక ఆల్బమ్ సాంగ్ లో కూడా డాన్స్ చేసి ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు తాజాగా ఓ పాన్ ఇండియా మూవీలో మోనాలిసాకి బంపర్ ఆఫర్ వచ్చింది. హైదరాబాద్ లో ఆ సినిమాకి సంబంధించిన పూజ కార్యక్రమాలు కూడా ఘనంగా జరిగాయి. ఇట్స్ ఓకే గురు,క్రష్ వంటి సినిమాల్లో నటించిన నటుడు సాయి చరణ్ మరో కొత్త సినిమాతో మన ముందుకు రాబోతున్నారు. అయితే సాయి చరణ్ హీరోగా రాబోతున్న ఈ సినిమాలో హీరోయిన్ గా మోనాలిసాని తీసుకున్నారు. ఈ సినిమాకి శ్రీను కోటపాటి దర్శకత్వం వహించనుండగా శ్రీ వెంగమాంబ మూవీస్ బ్యానర్‌పై అంజయ్య విరిగినేని, ఉష విరిగినేని నిర్మాతలుగా చేస్తున్నారు. ఈ సినిమా కేవలం తెలుగులోనే కాకుండా హిందీ ,తమిళ, మలయాళ,కన్నడ భాషల్లో కూడా ఏకకాలంలో తెరకెక్కబోతోంది. ఈ మూవీలో సీనియర్ నటుడు హరీష్ కూడా ఒక కీ రోల్ పోషిస్తున్నట్టు అర్థమవుతుంది. ఇక ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని విషయాలు త్వరలోనే అధికారికంగా బయట పడబోతున్నాయి. ఏది ఏమైనప్పటికీ మోనాలిసా పాన్ ఇండియా మూవీలో ఆఫర్ కొట్టేయడంతో చాలామంది నెటిజెన్స్ మోనాలిసా నక్కతోక తొక్కింది అని కామెంట్లు చేస్తున్నారు.

## ఆ నొప్పి తెలియాలి: రష్మిక


ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు ఎక్కువగా తమ సినిమా ప్రమోషన్స్ చేసుకోవడానికి రియాల్టీ షోలలో పాల్గొంటూ సందడి చేస్తున్న విషయం తెలిసిందే. మరి కొంతమంది టాప్ షోలలో కూడా పాల్గొంటూ ఆకట్టుకుంటున్నారు. అందులో భాగంగానే నేషనల్ క్రష్ రష్మిక మందన్న తాజాగా నటిస్తున్న చిత్రం ది గర్ల్ ఫ్రెండ్. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నవంబర్ 7వ తేదీన తెలుగు ,హిందీ భాషల్లో విడుదల కానుండగా.. తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో నవంబర్ 14వ తేదీన రిలీజ్ కాబోతోంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో కన్నడ హీరో దీక్షిత్ శెట్టి లీడ్రోల్ పోషిస్తూ వస్తున్న ఈ చిత్రం ప్రమోషన్స్ లో భాగంగా రష్మిక జోరుగా పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఇదివరకే బిగ్ బాస్ సీజన్ 9 షోలో గెస్ట్ గా పాల్గొని తన సినిమాను ప్రమోట్ చేసిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు జగపతిబాబు హోస్టా వ్యవహరిస్తున్న జయమ్ము నిశ్చయమ్మురా కార్యక్రమానికి విచ్చేసింది.





## అరుంధతిగా శ్రీలీల

టాలీవుడ్ సినీ హిస్టరీలో సూపర్ నేచురల్ థ్రిల్లర్ లకు కొత్త దారి చూపించిన సినిమా అరుంధతి. పునర్జన్మ కథగా తెరకెక్కిన ఈ సినిమా మాయ, మంత్రం, సెంటిమెంట్, థ్రిల్ అన్నింటినీ కలగలిపి ఆడియన్స్ ను ఆకట్టుకుంది. హారర్, థ్రిల్లర్, ఎమోషన్స్ అన్నింటినీ బ్యాలెన్స్ చేస్తూ వచ్చిన ఈ సినిమాకు ఇప్పటికీ ఆడియన్స్ గుండెల్లో ప్రత్యేక స్థానముంటుంది. అప్పటివరకు హీరోల సరసన రొమాంటిక్ సినిమాలు చేస్తూ వచ్చిన అనుష్కను స్టార్ హీరోయిన్ గా మార్చింది ఆ సినిమానే. అరుంధతి సినిమా అనుష్కకు ఉత్తమ నటిగా నంది అవార్డు, ఫిల్మ్ ఫేర్ అవార్డులను కూడా తెచ్చిపెట్టింది. అప్పట్లోనే అరుంధతిలో వచ్చిన వీఎఫ్ఎక్స్ ఎంతో హాట్ టాపిక్ గా మారడంతో పాటూ ఈ మూవీ సాధారణ ఆడియన్స్ నుంచే కాకుండా విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. అలాంటి మైథలాజికల్ థ్రిల్లర్ ను ఇప్పుడు బాలీవుడ్ లో రీమేక్ చేస్తున్నారు. ప్రస్తుతం హారర్ సినిమాలకు మంచి ఆదరణ ఉండటంతో ఈ సినిమాను రీమేక్ చేయాలని భావించి దాన్ని పట్టాలెక్కించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే అరుంధతి లాంటి మాస్టర్ పీస్ సినిమాలను రీమేక్ చేయడానికి ఎన్నో గట్స్ కావాలి. అందులోనూ ఓ భాషలో బ్లాక్ బస్టర్ గా నిలిచిన సినిమాను రీమేక్ చేస్తే దానికి పోలికలు పెట్టే ప్రమాదం కూడా ఉంటుంది. అందులోనూ అనుష్క నటించిన పాత్రను శ్రీలీలతో చేయించడమంటే ఇది చాలా పెద్ద సవాలనే చెప్పాలి. టాలీవుడ్ లో వరుస ఫ్లాపులతో ఇబ్బంది పడుతున్న శ్రీలీలకు అరుంధతి రీమేక్ ఛాన్స్ సువర్ణావకాశమైనప్పటికీ ఆమె అనుష్క స్టాండర్డ్స్ ను ఏ మేరకు మ్యాచ్ చేస్తుందనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది.




## పెద్ది.. చికిరి చికిరి ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్

గ్లోబల్ స్టార్ గా పేరు సొంతం చేసుకుని.. ఇప్పుడు ఆ ట్యాగ్ ను కూడా తొలగించి.. తన కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు రామ్ చరణ్. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 27వ తేదీన తన కొత్త చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆ చిత్రం ఏదో కాదు పెద్ది. ఉప్పెన సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని మొదటి సినిమాతోనే 100 కోట్ల క్లబ్లో చేరిన బుచ్చిబాబు సనా ఈ చిత్రానికి దర్శకత్వం అందిస్తున్నారు.. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే ఆస్కార్ గ్రహీత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉండగా నిన్న వాట్ ఈజ్ చికిరి ? అంటూ ఒక పోస్టర్ రిలీజ్ చేస్తూ ఫస్ట్ సింగిల్ పై అంచనాలు పెంచేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా స్టూడియోలో ఏఆర్ రెహమాన్, బుచ్చిబాబు డిస్కషన్ చేసుకుంటున్నట్టు ఆ పోస్టర్ ను విడుదల చేశారు. అన్నట్టుగానే ఈరోజు ఆ చికిరి మీనింగ్ ఏంటో చెప్పేసి ఫస్ట్ సింగిల్ ప్రోమోని విడుదల చేశారు మేకర్స్. మరి బుచ్చిబాబు సనా చెప్పిన ఆ చికిరి అర్థం ఏమిటి? ఈ ఫస్ట్ సింగిల్ ఎప్పుడు రిలీజ్ చేయబోతున్నారు? ప్రోమో ఎలా ఉంది? అనే విషయాలు వైరల్ గా మారుతున్నాయి. ఈ చికిరి పాటను రామ్ చరణ్, జాన్వీ కపూర్ మీద తెరకెక్కించారు. వీళ్ళిద్దరూ జంటగా నటిస్తున్న తొలి చిత్రం కూడా ఇదే కావడం గమనార్హం.. ఈ పాటకు ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించగా.. మోహిత్ చౌహాన్ ఆలపించారు. ఈ పాట కోసం ఏ ఆర్ రెహమాన్, మోహిత్ మీద స్పెషల్ వీడియో కూడా షూట్ చేశారు బుచ్చిబాబు సన. ఈ స్పెషల్ వీడియోలో చికిరి గురించి అర్థం చెబుతూ.. కొండల్లో ఉంటున్న హీరో రామ్ చరణ్ తొలిసారి హీరోయిన్ జాన్వీని చూసే సందర్భంలో వచ్చే పాట చికిరి. ఈ పాటకు బాణీ కోసం రెహమాన్ కు సందర్భాన్ని వివరించేటప్పుడు.. కాటుక అక్కర్లేని కళ్ళు.. ముక్కుపుడక అక్కర్లేని ముక్కు.. అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరి రా ఈ చికిరి అని చెబుతాడు.. అసలు ఆ చికిరి అంటే ఏంటి ? అని రెహమాన్ అడగగా.. వాళ్ళ ఊరిలో ఆడపిల్లలను ముద్దుగా, ప్రేమగా చికిరి అని పిలుస్తారు అని చెప్పారు. ఇక ఆ చికిరి పదం మీద రెహమాన్ పాట పాడేశారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన ప్రోమోని విడుదల చేయగా పూర్తి పాటను నవంబర్ ఏడవ తేదీన విడుదల చేయనున్నట్లు ప్రోమో చివర్లో ప్రకటించారు.. ప్రస్తుతం ఈ ప్రోమో కాస్త పాటపై అంచనాలను పెంచేసింది. ఇకపోతే ఇక్కడ రామ్ చరణ్ హుక్ స్టెప్పు కూడా ప్రేక్షకులను అలరిస్తోంది అని చెప్పవచ్చు.

## ప్రమోషన్లు మొదలుకాని అఖండ2

వరుస సక్సెస్‌లతో ఫుల్ జోష్ లో ఉన్న నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం అఖండ2 చేస్తున్న సంగతి తెలిసిందే. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వలో తెరకెక్కుతున్న ఈ సినిమా సూపర్ హిట్ మూవీ అఖండకు సీక్వెల్ రూపొందుతోంది. అసలే బాలయ్య- బోయపాటి కాంబినేషన్ కు మంచి క్రేజ్, డిమాండ్ ఉన్నాయి. పైగా అఖండ సినిమాకు సీక్వెల్ కావడంతో అఖండ2పై భారీ అంచనాలున్నాయి. బోయపాటి శ్రీను కూడా ఆ అంచనాలకు ఏ మాత్రం తీసిపోకుండా అఖండ2 ను తెరకెక్కిస్తున్నారు. వాస్తవానికైతే అఖండ2 ఈపాటికే రిలీజవాల్సింది. కానీ షూటింగ్ లో జాప్యం కారణంగా ఈ సినిమా



వాయిదా పడి డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. అంటే రిలీజ్ కు మరో నెల రోజులే టైముంది. అఖండ2 లాంటి భారీ బడ్జెట్ సినిమాకు ఇది చాలా టైమ్. ఇప్పటికే ప్రమోషన్స్ ను కూడా మొదలుపెట్టి ఉండాల్సింది కానీ ఇప్పటివరకు అఖండ2 నుంచి ఎలాంటి ప్రమోషనల్ కంటెంట్ బయటకు రాలేదు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నప్పటికీ సినిమా నుంచి కనీసం ఒక్క పాట కూడా రిలీజ్ చేయకపోవడం, ఇంకా ప్రమోషన్స్ ను మొదలుపెట్టకపోవడం ఫ్యాన్స్ కు ఆందోళనను కలిగిస్తోంది. ఇలాంటి సినిమాలకు ఎప్పుడో ప్రమోషన్స్ స్టార్ట్ చేసి, సినిమాపై బజ్ పెంచాల్సింది కానీ మేకర్స్ మాత్రం ఇంకా ప్రమోషన్స్ ను స్టార్ట్ చేయకపోవడంతో అభిమానులు టెన్షన్ పడుతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఆడియన్స్ ను ఎంగేజ్ చేసే ఎలిమెంట్స్ పుష్కలంగా ఉన్న ఈ మూవీ రిలీజ్ కు చాలా తక్కువ టైమే ఉండటంతో మేకర్స్ ఇంకెప్పుడు ప్రమోషన్స్ ను స్టార్ట్ చేస్తారా అని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# శ్రీచరణికి సర్కారు కొలువు!

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భారత లెఫ్టార్మ్ స్పిన్నర్, కడప అమ్మాయి శ్రీ చరణికి కూడా ఏపీ సర్కార్ నుంచి భారీ బహుమతి లభించనుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి వన్డే ప్రపంచకప్ ఆడిన ప్లేయర్‌గా నిలిచిన నల్లపురెడ్డి శ్రీచరణిని ఏపీ ప్రభుత్వం ఘనంగా సన్మానించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం, భారీ నజరానా ప్రకటించేందుకు సిద్దమవుతుంది. ప్రస్తుతానికి ఈ విషయాలు అధికారికంగా వెల్లడి కాకపోయినా.. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచకప్ గెలిచిన శ్రీచరణి ప్రస్తుతం జట్టుతో న్యూఢిల్లీలో ఉంది. బుధవారం భారత మహిళలను ప్రధాని నరేంద్ర మోదీ సన్మానించనున్నారు. గురువారం విజయవాడకు రానున్న శ్రీ చరణికి ఘన స్వాగతం పలికేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) భారీ ఏర్పాట్లు చేస్తోంది. గన్నవరం విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏసీఏ సిద్దమైంది. మెరుగైన ప్రదర్శనతో ఆంధ్ర గర్వపడేలా చేసిన శ్రీచరణిని సీఎం చంద్రబాబు నాయుతో పాటు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సన్మానించనున్నారు. ఈ సందర్భంగానే ఆమెకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు క్యాష్ ప్రైజ్, ఇంటి స్థలంను బహుమతిగా అందజేయనున్నారు. అయితే ఈ విషయంపై ఏపీ సర్కార్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కానీ శ్రీచరణి సాధించిన విజయానికి ఏపీ సర్కార్ ఫిదా అయ్యిందని, అదిరిపోయే బహుమతి ఇవ్వాలనుకుంటుందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. గతంలో ఒలింపిక్ మెడల్ గెలిచిన పీవీ సింధుకు గ్రూప్-1 ఉద్యోగంతో పాటు రూ. 3కోట్ల క్యాష్ ప్రైజ్ బహుమతిగా అందజేశారు. శ్రీ చరణికి కూడా అదే తరహాలో భారీ రివార్డ్ దక్కనున్నట్లు తెలుస్తోంది.




# నేడే నాలుగో టీ20

**1-1 సమంతో ఇరు జట్లు**

ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచిన భారత జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా జరిగే నాలుగో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మూడో టీ20లో అద్వితీయమైన ప్రదర్శనతో ఐదు వికెట్ల తేడాతో గెలుపొందిందిన భారత్.. అదే జోరును నాలుగో టీ20లోనూ కొనసాగించాలనుకుంటుంది. మరోవైపు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై పట్టు సాధించాలని ఆసీస్ భావిస్తోంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సిరీస్‌లో కాన్‌బెర్రా వేదికగా జరిగిన తొలి టీ20 వర్షంతో రద్దయ్యింది. రెండు, మూడో టీ20కి వర్షం ముప్పు పొంచి ఉందని వార్తలు వచ్చినా.. మ్యాచ్‌లు సజావుగానే సాగాయి. ఈ క్రమంలోనే నాలుగో టీ20కి ఆతిథ్యం ఇచ్చే గోల్డ్ కాస్ట్‌లో ఎలాంటి వర్షం ముప్పు లేదు.

**తుది జట్లు(అంచనా)**

**భారత్:** శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ(కీపర్), అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా

**ఆస్ట్రేలియా:** మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లీస్, టీమ్ డేవిడ్, మిచెల్ ఓవెన్, మార్కస్ స్టోయినీస్, మాథ్యూ షార్ట్, సీన్ అబాట్, గ్జేవియర్ బార్ట్‌లెట్, నాథన్ ఎల్లిస్, మాథ్యూ కుహ్నెమన్.



# అందుకే అర్ష్‌దీప్‌కు నో చాన్స్: మోర్నీ మోర్కెల్

ఆస్ట్రేలియాతో తొలి రెండు టీ20లకు అర్ష్‌దీప్ సింగ్‌ను ఎందుకు పక్కనపెట్టామో అతనికి అర్థమైందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2026 కాంబినేషన్ కోసం ప్రయోగాలు చేస్తున్నామని, ఈ క్రమంలోనే అతనికి అవకాశం దక్కలేదని వివరణ ఇచ్చాడు. ఈ విషయాన్ని అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడని చెప్పాడు. మూడో టీ20లో రీఎంట్రీ ఇచ్చిన అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా నాలుగో టీ20 జరగనున్న నేపథ్యంలో మోర్నీ మోర్కెల్ బుధవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా అర్ష్‌దీప్ సింగ్‌ను పక్కనపెట్టడంపై క్లారిటీ ఇచ్చాడు. 'అర్ష్‌దీప్ సింగ్ చాలా అనుభవం కలిగిన బౌలర్. మా ప్రయోగాల గురించి అతను పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అతను ఒక ప్రపంచ స్థాయి బౌలర్. పవర్ ప్లేలో అత్యధిక వికెట్లు తీసే బౌలర్. జట్టుకు అతని విలువ ఏంటో మాకు తెలుసు. అయితే ఈ పర్యటనలో మేం వివిధ కాంబినేషన్లను ప్రయత్నించాం. జట్టు ఎంపిక టీమ్‌మేనేజ్‌మెంట్‌తో పాటు ఆటగాళ్లకు సవాలే. టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట విభిన్నమైన కాంబినేషన్స్‌ను ప్రయత్నించాలనుకుంటున్నాం. దీంతో ఆటగాళ్లు తమకు అవకాశం రాలేదని నిరాశకు గురవ్వడం సహజమే. కానీ, మేనేజ్‌మెంట్ మరోలా ఆలోచిస్తుంది. ఆటగాళ్లను ఇంకా శ్రమించేలా ప్రోత్సహిస్తాం. ఎప్పుడూ అవకాశం వచ్చినా అత్యుత్తమ ఆటతీరు కనబర్చేలా సన్నద్ధం చేస్తాం. వచ్చే పొట్టి కప్‌లోగా చాలా తక్కువ మ్యాచ్‌లనే ఆడాల్సి ఉంటుంది. ఒత్తిడి సమయాల్లో ఆటగాళ్లు ఎలా రాణిస్తారనేది పరీక్షించాం. వారి సత్తాపై మాకు ఎలాంటి సందేహం లేదు. మ్యాచ్‌లను ఎలా గెలవాలనే దానిపైనే వర్కౌట్ చేస్తున్నాం.'అని మోర్నీ మోర్కెల్ వెల్లడించాడు. నితీష్ కుమార్ రెడ్డి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, నాలుగో టీ20లో బరిలోకి దిగుతాడని మోర్కెల్ తెలిపాడు.



# కావ్య పాప.. క్లాసెన్.. సీఎస్కే..!

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన మినీ వేలం డిసెంబర్ రెండవ వారంలో జరగనుంది. ఇప్పటికైతే మినీ వేలానికి సంబంధించిన వివరాలను బీసీసీఐ అధికారికంగా ప్రకటించలేదు. కానీ పలు నివేదికల ప్రకారం నవంబర్ చివరి వారంలోపు 10 ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్, రిలీజ్ ప్లేయర్ల జాబితాలను ప్రకటించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఫ్రాంచైజీలు అంటిపెట్టుకునే, వదిలేసే ఆటగాళ్లపై ఫోకస్ పెట్టాయి. గత మెగా వేలంలో అత్యధిక ధర పలికి, స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లను ఫ్రాంచైజీలు వదిలేయనుకుంటున్నాయి. తద్వారా భారీ సొమ్ముతో వేలంలోకి వెళ్లవచ్చని భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ స్టార్ ప్లేయర్ హెన్రీచ్ క్లాసెన్‌ను వదులుకునేందుకు సిద్ధమైందని టైమ్స్ ఆఫ్ ఇండియా ఒక కథనాన్ని ప్రచురించింది.




గత సీజన్ వేలానికి ముందు ఆరెంజ్ ఆర్మీ.. క్లాసెన్‌ను రూ. 23 కోట్ల భారీ ధరకు రిటైన్ చేసుకుంది. క్లాసెన్ కూడా ఈ ధరకు న్యాయం చేశాడు. 13 మ్యాచ్‌ల్లో 487 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీతో పాటు హాఫ్ సెంచరీ ఉంది. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌కు క్లాసెన్ వీడ్కోలు పలికాడు. కేవలం ఫ్రాంచైజీ క్రికెట్ మాత్రమే ఆడుతున్నాడు. ఐపీఎల్ తర్వాత జరిగిన పలు ఫ్రాంచైజీ టోర్నీల్లో క్లాసెన్ నిరాశపర్చాడు. ఈ క్రమంలోనే అతన్ని వేలంలోకి వదిలేసి, తక్కువ ధరకు తిరిగి కొనుగోలు చేయాలని కావ్యమారన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇది సరైన నిర్ణయం కాదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. క్లాసెన్‌ను వదిలేస్తే సీఎస్‌కే వేలంలో అతన్ని వదిలిపెట్టదని చెబుతున్నారు. హెన్రీచ్ క్లాసెన్ వంటి ఆటగాళ్లు సీఎస్‌కేకు అవసరమని, అతను గనుక ఆ జట్టులోకి వెళ్తే బ్యాటింగ్ విభాగం ప్రమాదకరంగా మారుతుందని అంచనా వేస్తున్నారు. క్లాసెన్ కోసం సీఎస్‌కే ఎంత ఖర్చు అయినా చేస్తుందని హెచ్చరిస్తున్నారు.




# నం.1గానే హిట్ మ్యాన్

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. మరోవైపు, న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అద్భుత ప్రదర్శనతో కెరీర్‌లోనే అత్యుత్తమంగా మూడో ర్యాంకుకు ఎగబాకాడు. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను 3-0తో గెలవడంలో మిచెల్ కీలక పాత్ర పోషించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి రెండు వన్డేల్లో 56, 44 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన మిచెల్.. మొత్తం సిరీస్‌లో 178 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. ఈ ప్రదర్శనతో అతను రెండు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. ఇదే సిరీస్‌లో రాణించిన మరో కివీస్ ఆటగాడు రచిన్ రవీంద్ర నాలుగు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 14వ ర్యాంకును అందుకున్నాడు. ఇతర ఆటగాళ్లలో దక్షిణాఫ్రికాకు చెందిన క్వింటన్ డికాక్ తిరిగి 19వ స్థానానికి చేరుకోగా, పాకిస్థాన్ ఓపెనర్ ఫఖర్ జమాన్ 26వ స్థానానికి, సల్మాన్ ఆఘా తొమ్మిది స్థానాలు ఎగబాకి 30వ ర్యాంకుకు చేరుకున్నారు. బౌలింగ్‌లో ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ కెరీర్ బెస్ట్ మూడో ర్యాంకును అందుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ నసీమ్ షా (33), న్యూజిలాండ్ బౌలర్ జాకబ్ డఫీ (39) కూడా తమ ర్యాంకులను గణనీయంగా మెరుగుపరుచుకున్నారు. టీ20 ర్యాంకింగ్స్‌లో వెస్టిండీస్ బ్యాటర్ షాయ్ హోప్ కెరీర్‌లోనే ఉత్తమంగా 12వ స్థానానికి చేరుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్ బ్యాటర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (15), ఇబ్రహీం జాద్రాన్ (20) కూడా తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ 10 స్థానాలు ఎగబాకి 35వ ర్యాంకుకు చేరుకున్నాడు. బౌలింగ్ విభాగంలో పాకిస్థాన్ పేసర్ షాహీన్ షా అఫ్రిది మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 13వ ర్యాంకులో నిలిచాడు. ఆఫ్ఘనిస్థాన్ స్పిన్నర్ ముజీబ్ ఉర్ రహ్మాన్ 13 స్థానాలు ఎగబాకి 14వ ర్యాంకుకు చేరుకున్నాడు. అయితే, పాకిస్థాన్‌కు చెందిన యువ ఫాస్ట్ బౌలర్ సల్మాన్ మీర్జా ఏకంగా 98 స్థానాలు ఎగబాకి 45వ ర్యాంకును అందుకొని అందరి దృష్టిని ఆకర్షించాడు.

# ఐసీసీ మీటింగ్‌కు ట్రోఫీ 'దొంగ' డుమ్మా

ఆసియా కప్ ట్రోఫీ వివాదం నేపథ్యంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ కార్యనిర్వాహక బోర్డు సమావేశానికి హాజరు కావడం లేదని తెలుస్తోంది. ఈ సమావేశంలో ఆయనపై తీవ్ర విమర్శలు చేయడంతో పాటు ట్రోఫీని తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేయనున్న నేపథ్యంలో మొహ్సిన్ నఖ్వీ ఈ భేటీని తప్పించుకుంటున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఐసీసీ 4 రోజుల సమావేశాలు నవంబర్ 4, 2025 నుంచి దుబాయ్‌లో ప్రారంభమయ్యాయి. ఆసియా కప్ ట్రోఫీ వివాదంపై బీసీసీఐతో నేరుగా ఘర్షణను తప్పించుకోవడానికి మొహ్సిన్ నఖ్వీ కొత్త ప్లాన్ వేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆయన ఐసీసీ సమావేశానికి హాజరు కావడం లేదని వార్తలు వస్తున్నాయి. భారత్ ఆసియా కప్ గెలిచిన తర్వాత ఏసీసీ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ (పాకిస్తాన్ మంత్రి కూడా) చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోవడానికి టీమిండియా నిరాకరించింది. దీనితో మొహ్సిన్ నఖ్వీ ఆ ట్రోఫీని తన వెంట తీసుకెళ్లారు. అప్పటి నుంచి ట్రోఫీ ఇంకా భారత్‌కు అందలేదు.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
గురువారం 6-11-2025
www.evarthalu.com



అత్తమామ ఎప్పుడూ మాతోనే ఉంటారు.. అది నాకు నచ్చదు.. నా భర్త వాళ్ల అమ్మానాన్నతో ఉండటం నాకు ఇష్టం లేదు.. మా ఆయన తెచ్చుకున్న బిస్కెట్ ప్యాకెట్ తిన్నా ఓర్చుకోలేడు.. నా భార్య నా తల్లిదండ్రులతో కలిసి ఉండనంటోంది.. ఇంట్లో పిల్లులు, కుక్కలు పెంచుకోవడం నాకు నచ్చదు.. ఇలాంటి కారణాలే విడాకులకు కారణాలు అవుతున్నాయి. మరి చట్టం ఇలాంటి కారణాలకు విడాకులు మంజూరు చేస్తుందా? ఎలాంటి కారణాలను కోర్టు పరిగణనలోకి తీసుకుంటుంది? అంటే న్యాయ నిపుణులు విడాకుల అంశంపై కీలక సమాచారాన్ని వెల్లడించారు.

# భరణం.. మెయింటెనెన్స్

### ఏ కారణాలతో విడాకులు ఇస్తారంటే..

- హిందూ మ్యారేజ్ యాక్ట్-1955 ప్రకారం, భార్య లేదా భర్తకు తమ వివాహాన్ని రద్దు చేసుకునే హక్కు ఉంటుంది.
- ఈ చట్టంలోని సెక్షన్ 13లో ఏ కారణాలతో విడాకులు తీసుకోవచ్చో కూడా పేర్కొన్నారు.
- వివాహేతర సంబంధాలు: ఇతరులతో వివాహేతర సంబంధాలను కారణంగా చూపించి విడాకులను కోరవచ్చు.
- క్రూరత్వం: దీన్ని నిర్వచించడం చాలా కష్టం. ఎందుకంటే దీనికంటూ ఒక ప్రత్యేకమైన నిర్వచనం అంటూ లేదు. మానసిక, శారీరక, లైంగిక ఇలా ఏ విధమైన క్రూరత్వాన్నైనా చూపించి విడాకులు కోరవచ్చు. దీన్ని ఏ కేసుకు ఆ కేసు విడివిడిగా చూడాల్సి ఉంటుంది.
- భార్య, భర్తల మధ్య సంబంధం లేకపోవడం: భార్య లేదా భర్తతో ఎలాంటి సంబంధం లేకపోవడం అంటే వీరు ఒకే ఇంట్లో ఉంటూ ఒకరిని మరొకరు పట్టించుకోకపోవడం లేదా అసలు పరిచయం లేనట్లు ప్రవర్తించడమూ కారణంగా చూపిస్తూ విడాకులు కోరవచ్చు.
- మతిస్థిమితం కోల్పోవడం: భార్య లేదా భర్త మతి స్థిమితం కోల్పోవడం లేదా పిచ్చి పట్టినట్లు ప్రవర్తించడాన్ని కూడా కారణంగా చూపించి విడాకులు పొందొచ్చు.
- మత మార్పిడి: భార్య లేదా భర్త వేరే మతానికి మారితే, ఈ కారణాన్ని చూపించి విడాకులు పొందొచ్చు.
- విడిచిపెట్టడం: జంటలో ఒకరు మరొకరిని విడిచిపెడితే, దీన్ని కారణంగా చూపించి విడాకులు పొందొచ్చు.
- కనిపించకుండా పోవడం: భార్య లేదా భర్త ఏడేళ్లపాటు కనిపించకుండా పోతే అతడు లేదా ఆమెను మరణించినవారిగా పరిగణిస్తారు. అప్పుడు దీన్ని కారణంగా చూపించి కోర్టులో విడాకులకు అభ్యర్థన పెట్టుకోవచ్చు.

### ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి?

సదరు వ్యక్తులు నివస్తున్న ప్రాంతంలోని కుటుంబ న్యాయస్థానంలో ఈ దరఖాస్తు చేసుకోవాలి. పెళ్లి జరిగిన ప్రాంతంలోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా భార్య నివసించే ప్రాంతంలోని కోర్టులోనూ ఈ దరఖాస్తు పెట్టుకోవచ్చు. విడాకులు కోరుకునే వారు దరఖాస్తు చేసుకున్నప్పుడు లేదా భార్యాభర్తలు ఒకరికొకరు నోటీసులు పంపినప్పుడు విడాకుల ప్రక్రియ ప్రారంభమవుతుంది. హిందూ వివాహ చట్టం-1955 ప్రకారం, కలిసి జీవించడంలో ఇబ్బందులు ఎదురైతే పరస్పర అంగీకారంతో విడాకుల ప్రక్రియను ప్రారంభించవచ్చు. రెండో పక్షం విడాకులకు సిద్ధంగా లేకపోతే ఆ ప్రక్రియను 'కంటెస్టెడ్ డివోర్స్' అంటారు.

### విడాకులు ఎందుకు తీసుకుంటున్నారు?

విడాకులు ఇచ్చేందుకు చట్టాల్లో కొన్ని కారణాలు పేర్కొన్నప్పటికీ, చాలా భిన్నమైన కారణాలతోనూ చాలా మంది విడాకులు కావాలని కోర్టులను ఆశ్రయిస్తుంటారు. మారుతున్న సామాజిక పరిస్థితులతో విడాకుల కారణాలు కూడా మారుతున్నాయి. అసలు నేనెందుకు రాజీ పడాలని చాలా మంది అనుకుంటున్నారు. ఒకప్పుడు వివాహ బంధంలో కొనసాగేందుకు చాలా ప్రయత్నించేవారు. ఇప్పుడు అలా కాదు. ఇద్దరూ ఒకే అభిప్రాయంతో ముందుకు వస్తున్నారు. కాబట్టి వారికి త్వరగా విడాకులు వస్తున్నాయి. కుటుంబం, సంబంధాల కంటే కొత్త జీవితాన్ని ప్రారంభించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అమ్మాయిలు కూడా నేడు ఆర్థికంగా స్వతంత్రంగా జీవిస్తున్నారు. దీంతో వారు సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. కుటుంబ వ్యవస్థ పట్ల వారి దృక్పథం కూడా మారుతోంది. పురుషుల్లో చాలా మంది ఇప్పటికీ పాత సంప్రదాయాలనే అనుసరిస్తున్నారు. వారు పాత తరహా కుటుంబమే కోరుకుంటున్నారు.

### వరకట్నం నేరం:

భారతీయ చట్టం ప్రకారం వరకట్నం అడగడం, ఇవ్వడం రెండూ నేరమే. అయినా, ఈ దురాచారాన్ని వదులుకోలేకపోతున్నారు ప్రజలు. ఇప్పటికీ చాలా చోట్ల వరకట్న వేధింపుల కారణంగా మహిళలు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. నిజానికి, 1961లో వరకట్న నిషేధ





చట్టం అమలులోకి వచ్చింది. పేరుకే ఇంత కఠినమైన చట్టం. 6 దశాబ్దాలు గడిచినా వరకట్నం చెల్లించేందుకే తమ జీవితాలు ధారపోస్తున్నా తల్లిదండ్రులు దేశంలో నూటికి తొంభైమంది కనిపిస్తారు. అందుకే, ఇప్పటికీ పెళ్లి తర్వాత వరకట్న వేధింపులకు బలవుతున్నారు గృహిణులు. వివాహ సమయంలో ఇచ్చినా అదనపు కట్నం తేలేదనే సూటిపోటి మాటలు, వేధింపులు అత్తగారింట్లో భరిస్తూనే కాపురాలు చేస్తున్నారు. ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఈ తంతు మాత్రం ఆగటం లేదు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం, 2024లో వరకట్న వేధింపుల కారణంగా 7045 మంది మహిళలు ప్రాణాలు కోల్పోయారు. గత కొన్ని సంవత్సరాల డేటాను పరిశీలిస్తే, 2017 నుండి 2021 వరకు, భారతదేశంలో మొత్తం 35,493 వరకట్న హత్య కేసులు నమోదయ్యాయి. వరకట్నాన్ని రూపుమాపేందుకు భారత ప్రభుత్వం వరకట్న నిషేధ చట్టం 1961 ను అమలులోకి తెచ్చింది. ఈ చట్టం ఉద్దేశం శిక్షించడం కాదు, మహిళలకు గౌరవం, భద్రతకు చట్టపరమైన హక్కులను అందించడం. అదనంగా, భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 304%దీ% ప్రకారం, ఒక మహిళ వివాహం అయిన 7 సంవత్సరాలలోపు మరణించి, ఆమె మరణానికి ముందు వరకట్నం కోసం హింసించబడిందని రుజువైతే దానిని వరకట్న హత్యగా పరిగణిస్తారు. అటువంటి సందర్భంలో, నిందితుడికి 7 సంవత్సరాల నుంచి జీవితకాలం వరకు జైలు శిక్ష విధించవచ్చు. అందువల్ల, వరకట్నం నేరం అయినప్పుడు పురుషుడు స్త్రీకి భరణం చెల్లించడం ఎంతవరకు సరైనదని చాలామంది వాదిస్తున్నారు.

### భరణం చట్టబద్ధం:

జీవిత భాగస్వామికి విడాకులు ఇచ్చిన తర్వాత పురుషుడు తన మాజీ భార్యకు భరణం చెల్లించాలి. దీని ఉద్దేశం ఆర్థిక సహాయం అందించడం. కొంతమంది మహిళలు వివాహం తర్వాత ఇంటి బాధ్యతల కోసం తమ ఉద్యోగాలను విడిచిపెట్టి భర్తలపై ఆధారపడవలసి వస్తుంది. అత్తగారు, మామగారు, భర్త, పిల్లలను చూసుకోవడానికి తమ కెరీర్ వదులుకుంటారు. అలాంటి సందర్భంలో ఏదైనా కారణం చేత విడాకులు తీసుకుంటే జీవిత భాగస్వామికి భరణం చెల్లించే చట్టం ఆమె భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుంది. భారతదేశంలోని చాలా మంది మహిళలు వివాహం తర్వాత పనికి వెళ్లరు. నిస్వార్థంగా ఇంటిని మేనేజ్ చేస్తారు. పిల్లలను పెంచడం, కుటుంబ శ్రేయస్సుకు తమదైన రీతిలో దోహదపడతారని భారతీయ చట్టం కూడా అంగీకరిస్తుంది. కానీ ఈ ఇంటి పనులు చేయడానికి వారికి డబ్బు లభించదు. మరోవైపు ఏదో ఒక కారణం వల్ల భార్యాభర్తల మధ్య విభేదాలు ఏర్పడి వారు విడాకులు తీసుకున్నప్పుడు ఆ స్త్రీలకు ఒంటరిగా జీవించడానికి డబ్బు, ఉద్యోగం, పొదుపు ఉండదు. అందువల్ల, అటువంటి మహిళలు సీఆర్పీసీ సెక్షన్ 125 మరియు గృహ హింస చట్టం 2005 ప్రకారం గృహనిర్మాణం, ఆహారం, ఇతర అవసరాలకు, వారి పిల్లల విద్య, సంరక్షణ కోసం అలిమోని తీసుకోవచ్చని భారతీయ చట్టాలు నిర్ధారించాయి. విడాకుల తర్వాత మహిళలు చేతులు చాచాల్సిన అవసరం లేకుండా ఈ చట్టం వారికి రక్షణ కల్పిస్తుంది.

### భర్త శారీరకంగా దూరంగా ఉంటే..

వివాహం కేవలం సామాజిక బంధం మాత్రమే కాదు, భార్యాభర్తల మధ్య హక్కులు, బాధ్యతలను కూడా చట్టబద్ధంగా అందిస్తుంది. వివాహ జీవితంలో భాగంగా శారీరక సంబంధాలు కీలకమైన భాగంగా పరిగణిస్తారు. భర్త తన భార్యతో స్వచ్ఛందంగా, సరైన కారణం లేకుండా లైంగిక సంబంధాలు కలిగి లేకపోతే, ఇది మానసిక, శారీరక క్రూరత్వంగా భావిస్తారు. సుప్రీంకోర్టు, హైకోర్టులు వివాహం తర్వాత భర్త తన భార్యతో లైంగిక సంబంధాన్ని నిరాకరించడం మానసిక క్రూరత్వంగా పరిగణించవచ్చని స్పష్టం చేశాయి. అలాంటి పరిస్థితుల్లో భార్య తన హక్కులను కోర్టులను ఆశ్రయించవచ్చు. హిందూ వివాహ చట్టం, 1955 (సెక్షన్ 13(1)(ఐఏ)) ప్రకారం, భర్త శృంగారాన్ని నిరాకరించడం వల్ల భార్య విడాకుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అదనంగా, సెక్షన్ 125 సీఆర్పీసీ కింద భార్య భరణం అడిగే హక్కు ఉంది.

### పరిహారం కోసం దరఖాస్తు చేయవచ్చు ఇలా..

- భర్త ఎలాంటి కారణం లేకుండా శారీరక సంబంధాలను నిరాకరిస్తే
- భార్య ఆర్థిక, మానసికంగా ఒత్తిడికి గురైన సమయంలో
- భార్యకు దీర్ఘకాలికంగా మానసిక హాని కలిగిస్తే

### మెయింటెనెన్స్, భరణం తేడా

భరణం, మెయింటెనెన్స్ మధ్య తేడా ఏమిటంటే, భరణం అనేది విడాకులు ఖరారైన తర్వాత ఒకేసారి పెద్ద మొత్తంలో ఇచ్చే ఆర్థిక సహాయం. అయితే మెయింటెనెన్స్ అనేది విడాకుల సమయంలో లేదా విడిపోయిన తర్వాత నెలవారీ లేదా కాలానుగుణంగా నిరంతరాయంగా ఇచ్చే ఆర్థిక సహాయం. మెయింటెనెన్స్ అనేది తాత్కాలికంగా లేదా శాశ్వతంగా ఉండవచ్చు. భార్య భర్తలు విడిపోయినప్పుడు, లేదా విడాకుల ప్రక్రియ కోర్టులో కొనసాగుతున్నప్పుడు ఆదాయం లేని భార్య లేదా భాగస్వామి జీవితాన్ని గడిపేందుకు ఇవ్వవలసిన సొమ్మునే మెయింటెనెన్స్ అంటారు. భాగస్వామి ఆహారం, దుస్తులు, వసతితో పాటు పిల్లల విద్య ఇతర బాగోగులు కూడా చూసుకోవాల్సిన అవసరం ఉంటుంది. మెయింటెనెన్స్ అనేది భాగస్వామికి మాత్రమే కాకుండా పిల్లలకు, తల్లితండ్రులకు కూడా వర్తిస్తుంది. ఆదాయం లేని భార్యకు తిండి, దుస్తులు, వసతి, విద్య, వైద్య చికిత్సకు అవసరమైన ఖర్చులను భాగస్వామి ఇవ్వాలని హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956 లోని సెక్షన్ 3 (బీ) చెబుతోంది. వివాహం కాని కూతురు ఉన్నప్పుడు ఆమె వివాహం అయ్యేవరకు అవసరమైన ఖర్చులను ఇవ్వాలి. భర్త మరణిస్తే ఆమె మామగారు (భర్త తండ్రి) మెయింటెనెన్స్ ఇవ్వాలని ఇదే చట్టంలోని సెక్షన్-19 చెబుతోంది. భర్త/భాగస్వామి ఆదాయంలో 25 శాతంతో పాటు భాగస్వామి జీవన శైలిని పరిగణనలోకి తీసుకుని కోర్టులు మెయింటెనెన్స్‌ను నిర్ణయిస్తాయి. ఉద్యోగం చేస్తున్న మహిళలు కూడా మెయింటెనెన్స్ పొందే హక్కు ఉంటుంది. ఇది కేసు పూర్వాపరాలపై ఆధారపడి ఉంటుంది. ఆమె సంపాదన, విడాకుల సమయంలో భరణం ఇచ్చిన విధానం లాంటివన్నీ పాత్ర పోషిస్తాయి. అయితే, ఆమె తిరిగి వివాహం చేసుకుంటే మెయింటెనెన్స్ లభించదు. భార్యకు భర్త కంటే అధిక సంపాదన ఉన్నప్పుడు, భర్తకు తగినంత ఆదాయం లేనప్పుడు మెయింటెనెన్స్ పొందే హక్కు ఉంటుందని హిందూ వివాహ చట్టం 1955లోని సెక్షన్ 24 చెబుతోంది.

టెంపరరీ మెయింటెనెన్స్:

కోర్టులో కేసు కొనసాగుతున్న సమయంలో భార్యకు తాత్కాలిక మెయింటెనెన్స్ ఇవ్వాలని కోర్టు చెబుతుంది. హిందూ వివాహ చట్టం 1955 లోని సెక్షన్ 24 ప్రకారం భాగస్వాముల్లో ఎవరికైనా జీవితాన్ని గడిపేందుకు ఆదాయం లేని పక్షంలో వారికి కోర్టు మెయింటెనెన్స్ మంజూరు చేస్తుంది.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.